ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
గురువారం 3 ఏప్రిల్ 2025



## నక్కపల్లి సంతలో అగ్నిప్రమాదం

- 50 దుకాణాలు దగ్ధం
- సంత రోజు కాకపోవడంతో చిరువ్యాపారులకు తప్పిన ముప్పు
- ఘటనపై హోం మంత్రి అనిత ఆరా

-వార్త 8వ పేజీలో


దగ్ధమవుతున్న పాకలు

# రోడ్ల కష్టాలకు తెర

**పాత రహదారులకు మరమ్మతులు, కొత్తగా సీసీ రోడ్ల నిర్మాణం**

- రూ.8.8 కోట్లతో 521.32 కి.మీ.ల ఆర్‌అండ్‌బీ రహదారులకు నూతన రూపు
- రూ.181.22 కోట్ల ఉపాధి నిధులతో సీసీ/బీటీ రోడ్లు
- సుఖంగా ప్రయాణిస్తున్నామంటున్న ప్రజలు


నర్సీపట్నం-కృష్ణాదేవిపేట రోడ్డులో పట్టణంలోని శివపురం వద్ద గతంలో రోడ్డు దుస్థితి


అదే రోడ్డు ప్రస్తుతం ఇలా..

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అడుగడుగునా రోడ్లపై గుంతలు. వాహనదారులు రాకపోకలు సాగించాలంటే నరకాన్ని చూడాల్సిందే. ఒక్క మాటలో చెప్పాలంటే రోడ్డెక్కాలంటే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి. ఇది గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదారుల దుస్థితి. ఐదేళ్ల పాలనలో ఒక్క ఏడాది కూడా రోడ్ల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం గోతులు అయినా పూడ్చకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రహదారులపై ప్రత్యేక దృష్టి సారించింది. తొలుత గుంతలు లేని రహదారుల కోసం నిధులు మంజూరయ్యాయి. జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో 1,100 కిలో మీటర్ల పొడవున రోడ్లు ఉన్నాయి. తొలి దశలో 521.32 కిలోమీటర్ల పొడవుగల పలు రోడ్లకు మరమ్మతులకు రూ.8.8 కోట్లు విడుదలయ్యాయి. కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. ఎక్కడా ఒక్క గొయ్యి లేకుండా మొత్తం కప్పేసిప్యాచ్ వర్క్ చేశారు. అవసరమైనచోట బీటీ లేయర్ వేశారు.

### ఉపాధి నిధులతో సీసీ రోడ్లు


ఉపాధి హామీ పథకం కింద సబ్బవరం మండలం జేపీ అగ్రహారంలో వేసిన సిమెంట్ రోడ్డు

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధి హామీ పథకం కన్వర్జెన్సీ నిధులతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి తొలి విడత (2024-25) రూ.181.22 కోట్లు మంజూరయ్యాయి. వీటితో 229 కిలోమీటర్ల మేర సిమెంట్/తారు రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. వాస్తవంగా ఈ పనులన్నీ సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే డిసెంబరు వరకు వర్షాలు కురవడంతో పనులకు ఆటంకం కలిగింది. మొత్తం మీద మార్చి నెలాఖరునాటి కొత్త రహదారుల నిర్మాణ పనులన్నీ పూర్తిచేశారు.

### మరో 20 రోడ్లకు రూ.51.8 కోట్లతో ప్రతిపాదనలు

జిల్లాలో రెండో దశలో మరో 20 రోడ్లకు నిధులు మంజూరు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. నాబార్డు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్‌తో 181 కిలోమీటర్ల పొడవున బీటీ రోడ్ల నిర్మాణానికి అనుమతులు కోసం ఫైల్ పంపారు. పరిపాలన పరమైన ఆమోదం రాగానే ఆయా పనులకు టెండర్లు పిలిచి ఖరారు చేస్తామని ఆర్‌అండ్‌బీ ఈఈ అజయ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు.


రోలుగుంట మండలంలో నిర్మించిన బీటీ రోడ్డు

# గ్రావెల్ దందా

**అచ్యుతాపురం మండలంలో యథేచ్ఛగా దోపిడీ**

- రాత్రి పూట ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు, టిప్పర్లతో తరలింపు
- ఒక్కో లోడు రూ.5-8 వేలకు విక్రయం
- కూటమిలో ఒక పార్టీకి చెందిన నేతల అక్రమాలు
- గతంలో వైసీపీ.. ఇటీవలే కండువాలు మార్చిన నాయకులు
- నియోజకవర్గస్థాయి నేత అండ
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు


కొండకర్లలో గ్రావెల్ తవ్వకాలతో చెరువులా మారిన ప్రదేశం

అచ్యుతాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి):

అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో కొత్తగా ఏర్పాటవుతున్న పరిశ్రమలు, మండలంలోని వివిధ గ్రామాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లకు పెద్ద మొత్తంలో గ్రావెల్ అవసరం అవుతున్నది. దీంతో కొంతమంది అక్రమార్కులు కొండపోరంబోకు భూముల్లో ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. వైసీపీ నుంచి ఇటీవల కూటమిలోని ఒక పార్టీలో చేరిన నాయకులు, నియోజకవర్గస్థాయి నేత అండదండలతో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుపుతున్నట్టు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అచ్యుతాపురం మండలంలో చోడపల్లి, కొండకర్ల, ఎర్రవరం, ఉప్పవరం, ఎంజేపురం, నడింపల్లి గ్రామాల పరిధిలోని కొండ ప్రాంతాల్లో నాణ్యమైన గ్రావెల్ వుంది. ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లో నిరంతరం కొత్తపరిశ్రమల ఏర్పాటు పనులు జరుగుతుంటాయి. ఈ క్రమంలో లోతట్టు ప్రదేశాలను ఎత్తు చేయడానికి, పునాదులు నింపడానికి పెద్ద మొత్తంలో గ్రావెల్ కావాలి. అదే విధంగా అచ్యుతాపురం మండలం పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతుండడంతో రియల్ ఎస్టేట్ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. లేఅవుట్లలో రోడ్ల నిర్మాణం, ఖాళీ స్థలాలను ఎత్తు చేయడానికి గ్రావెల్ అవసరం అవుతున్నది. దీనిని సొమ్ము చేసుకోవాలని కూటమిలోని రెండు పార్టీల నేతలు భావించారు. ఇటీవల వైసీపీ నుంచి అధికారంలో వున్న ఒక రాజకీయ పార్టీలో చేరిన నాయకులు గ్రావెల్ దందా జరుపుతున్నారు. గతంలో వైసీపీ అధికారంలో వున్నప్పుడు కూడా వీరే గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడ్డారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే వీరు కూడా పార్టీ కండువాలు మార్చేశారు. నియోజకవర్గస్థాయి నేత అండదండలతో రెచ్చిపోతున్నారు. గనులు, రెవెన్యూ శాఖల నుంచి అనుమతులు తీసుకోకుండా కొండపోరంబోకు భూములు, నిరుపయోగంగా మారిన చెరువుల్లో గ్రావెల్/ మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. ఎక్స్‌కవేటర్లతో రాత్రి పది గంటల నుంచి తెల్లవారుజామున ఐదు గంటల వరకు గ్రావెల్ తవ్వి, టిప్పర్ లారీలతో రవాణా చేస్తున్నారు. దూరాన్నిబట్టి ఒక్కో లోడుకు రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. పగటిపూట ఆయా ప్రాంతాలకు వెళితే గ్రావెల్ తవ్వుతున్న ఆనవాళ్లు కనిపిస్తాయే తప్ప వాహనాలు ఏవీ వుండవు. గ్రావెల్ అక్రమ తవ్వకాల విషయం మండల అధికారుల దృష్టికి వచ్చినప్పటికీ అడ్డుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు శాఖల్లో కొంతమంది అధికారులు, సిబ్బందికి పెద్ద మొత్తంలో ముడుపులు ముట్టజెబుతుండడంతోపాటు అధికారంలో వున్న ఒక పార్టీ నేతలు కావడంతో చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.


ఎంజేపురంలో గ్రావెల్‌తో ఎత్తు చేస్తున్న ఖాళీ స్థలాలు


ఎర్రవరం-ఉప్పవరం మధ్య తవ్వేసిన కొండ

# శక్తి బృందాలు

**మహిళలు, యువతులు, బాలికలను వేధించే వారికి ముగుతాడు**

- అనకాపల్లి, పరవాడ, నర్సీపట్నంలో ఐదు బృందాలు ఏర్పాటు
- ఒక్కో బృందంలో ఆరుగురు పోలీసులు
- ప్రతి బృందానికి ఎస్ఐ నాయకత్వం
- విద్యా సంస్థలు, ప్రధాన కూడళ్లలో మఫ్టీలో నిఘా
- ఆకతాయిలను పట్టుకుని చట్టపరంగా చర్యలు
- ఎస్పీ తుహిన్ సిన్హా


మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి):

మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపుల నియంత్రణ కోసం మహిళలకు రక్షణగా నిలిచే శక్తి బృందాలను ఏర్పాటు చేశామని ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం శక్తి బృందాల విధులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. మహిళలు, యువతులు, చిన్నారులపై ఎక్కడా అఘాయిత్యాలు జరగకుండా ప్రభుత్వం శక్తి బృందాలను ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. విద్యా సంస్థలు, ప్రధాన కూడళ్లలో శక్తి బృందాల సభ్యులు మఫ్టీలో సంచరిస్తూ ఆకతాయిలపై నిఘా పెట్టాలని ఆదేశించారు. మహిళలు, యువతులు, బాలికలను ఎవరైనా ఇబ్బంది పెడుతుంటే అటువంటి వారిని పట్టుకుని, చట్టపరమైన చర్యలు చేపడతారన్నారు. ఒక్కో బృందంలో ఆరుగురి చొప్పున మొత్తం 30 మందితో అనకాపల్లి, పరవాడ, నర్సీపట్నంలో ఐదు బృందాలను నియమించామని తెలిపారు. ప్రతి బృందానికి ఎస్ఐ నాయకత్వం వహించాలని ఆదేశించారు. శక్తి యాప్‌కు వచ్చే ఎస్ఓఎస్ కాల్స్ ... మిగతా 8వ పేజీలో

# ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

**మండలానికో గ్రామం చొప్పున ఎంపిక**

- శత శాతం రైతులు సేంద్రీయ విధానంలో పంటలు పండించేలా చర్యలు
- ఇప్పటికే రైతులకు అవగాహన సదస్సులు
- ఘన, ద్రవ జీవామృతాల తయారీపై శిక్షణ
- రానున్న ఖరీఫ్ నుంచే అమలు


ద్రవ జీవామృతం తయారు చేస్తున్న రైతులు (ఫైల్ ఫొటో)

చోడవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి):

ప్రకృతి సేద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నది. ఇందులో భాగంగా ప్రతి మండలంలో ఒక ఊరును పూర్తిగా ప్రకృతి వ్యవసాయ గ్రామంగా తీర్చిదిద్దాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా సుమారు నెల రోజుల నుంచి వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రకృతి వ్యవసాయం చేయడానికి అవసరమైన వనరులు వున్న గ్రామాలను గుర్తించారు. ప్రకృతి వ్యవసాయం చేయడానికి ఆవులు ప్రధాన కాబట్టి వీటికి సంబంధించిన సమాచారాన్ని పశుసంవర్ధక శాఖ నుంచి తీసుకున్నారు. రానున్న ఖరీఫ్ నుంచి ఆయా గ్రామాల్లోని పొలాల్లో నూరు శాతం ప్రకృతి సేద్యం విధానంలో పంటలను సాగు చేస్తారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు.

ప్రకృతి వ్యవసాయం దిశగా రైతాంగాన్ని అడుగులు వేయించే లక్ష్యంలో భాగంగా జిల్లాలోని ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేశారు. దీనిని 'ప్రకృతి వ్యవసాయ దత్తత' గ్రామంగా ప్రకటించారు. ఆ గ్రామంలో నూరు శాతం రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ విభాగం, డ్వాక్రా సంఘాల సమన్వయంతో చైతన్యవంతం చేసే కార్యక్రమాలకు వ్యవసాయ శాఖ శ్రీకారం చుట్టింది. జిల్లాలోని చోడవరం, మాడుగుల, నర్సీపట్నం, అనకాపల్లి, ఎలమంచిలి, పాయకరావుపేట వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ల పరిధిలోని మండలాల్లో 24 గ్రామాలను ఎంపిక చేశారు. రసాయన ఎరువులను ఉపయోగించి పంటలను సాగు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించడంతో పాటు, ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు.

చోడవరం సబ్ డివిజన్ పరిధిలో చోడవరం మండలంలో దామునాపల్లి, చీడికాడలో మంచాల, కె.కోటపాడులో డి.అగ్రహారం, దేవరాపల్లిలో చిన నందిపల్లి, బుచ్చెయ్యపేటలో కొండపాలెం దత్తత గ్రామాలుగా ఎంపికయ్యాయి. అనకాపల్లి సబ్‌డివిజన్‌లోని అనకాపల్లి మండలంలో వెంకుపాలెం, మునగపాకలో చూచుకొండ, కశింకోటలో ఆనందపురం, సబ్బవరంలో తవ్వవానిపాలెం, పరవాడలో రావాడ, ఎలమంచిలి ... మిగతా 8వ పేజీలో

**ప్రత్యేక కేంద్రాల ద్వారా**

## బియ్యం, కందిపప్పు అమ్మకం

- జిల్లా పౌరసరఫరాల అధికారి కేవీఎల్ఎన్ మూర్తి



అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని పట్టణాలు, పలు మండలాల్లో ప్రత్యేక కేంద్రాల ద్వారా నాణ్యమైన బియ్యం, కందిపప్పును ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయిస్తున్నట్టు జిల్లా పౌరసరఫరాల అధికారి కేవీఎల్ఎన్ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లిలో ఎనిమిది కేంద్రాలు, చోడవరంలో ఆరు, నర్సీపట్నంలో ఐదు, కె.కోటపాడులో ఐదు, ఎలమంచిలి, రోలుగుంట, పాయకరావుపేట, కోటవురట్ల, బుచ్చెయ్యపేట, అచ్యుతాపురం, మాడుగుల, మాకవరపాలెం, పరవాడల్లో రెండేసి కేంద్రాలు, కశింకోట, రాంబిల్లి, నాతవరం, నక్కపల్లి, ఎస్.రాయవరం, దేవరాపల్లి, చీడికాడ మండలాల్లో ఒక్కో కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఈ కేంద్రాల్లో కందిపప్పు కిలో రూ.160, బీపీటీ రకం స్టీమ్డ్ బియ్యం కిలో రూ.49లు, బీపీటీ సాధారణ రకం కిలో రూ.48కి విక్రయిస్తున్నట్టు పేర్కొన్నారు.

# వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

**తామరం వద్ద బైక్‌లు ఢీకొని ప్రాణాలు కోల్పోయిన వార్డు మెంబర్**

- రేగుపాలెం జంక్షన్ వద్ద లారీ ఢీకొనడంతో ఒకరు దుర్మరణం
- ఎలమంచిలిలో విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి
- నర్సయ్యపేటలో చెట్టు పైనుంచి పడి కల్లుగీత కార్మికుడు..

మాకవరపాలెం/ ఎలమంచిలి/ చోడవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని వివిధ ప్రదేశాల్లో బుధవారం సంభవించిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. వీరిలో ఇద్దరు రోడ్డు ప్రమాదాల్లో, ఒకరు విద్యుదాఘాతంతో, మరొకరు చెట్టు పైనుంచి పడి ప్రాణాలు కోల్పోయారు. ఆయా సంఘటనలకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం గ్రామానికి చెందిన లాలం మణిబాబు (43) పంచాయతీ వార్డు సభ్యునిగా వ్యవహరిస్తున్నారు. బుధవారం సాయంత్రం కుమారుడితో కలిసి బైక్‌పై మాకవరపాలెం వచ్చాడు. కిరాణా సామాగ్రి కొనుగోలు చేసి తిరిగి వెళుతుండగా తామరం పంచాయతీ పరిధి అవంతి కాలేజీ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్, మణిబాబు ప్రయాణిస్తున్న బైక్‌ను బలంగా ఢీకొన్నది. దీంతో ఆయన రోడ్డుపై పడిపోయి తలకు బలమైనగాయం అయ్యింది. కుమారుడు హర్ష కాలు విరిగిపోయింది. ఇద్దరినీ నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మణిబాబు మృతిచెందాడు. ఈ సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ... మిగతా 8వ పేజీలో




రేగుపాలెం జంక్షన్ వద్ద ప్రమాద దృశ్యం (ఇన్‌సెట్‌లో) మృతిచెందిన ఎరిపిల్లి దానయ్య


లాలం మణిబాబు (ఫైల్ ఫొటో)


మేడిశెట్టి నూకరాజు (ఫైల్)

# ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

» రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ 'ప్రగడ' వెల్లడి

» టీడీపీ కార్యాలయంలో వినతులు స్వీకరణ



కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా అంతా ముందుకు సాగాలని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో బుధవారం ప్రజలతో పాటు కార్యకర్తల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వివరించిన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యకర్తలంతా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలకు మరింత దగ్గర కావాలని సూచించారు. అనంతరం మునిసిపాలిటీ పరిధి పెదపల్లి వార్డులో టీడీపీ కార్యకర్త బి.త్రినాథ్ ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి రూ.ఐదు లక్షల బీమా చెక్కును ప్రగడ అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలుకులూరి విజయ్‌బాబు, జిల్లా అధికార ప్రతినిధి కాండ్రకోట చిరంజీవి, రాజాన నారాయణమ్మ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు, నాయకులు బొద్దపు శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ బొద్దపు నాగేశ్వరావు, నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.

## యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా 'ధూళి' ప్రమాణం



యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణం చేస్తున్న రంగనాయకులు

ఎలమంచిలి/రాంబిల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ధూళి రంగనాయకులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, మంత్రి పార్థసారథి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరుల సమక్షంలో రంగనాయకులు ప్రమాణం చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి తాను అందిస్తున్న సేవలను గుర్తించి తనకు ఈ పదవి కట్టబెట్టినందుకు అందరికీ ఆయన పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఇదిలావుంటే, రంగనాయకులు ప్రమాణ స్వీకారం చేయడంతో పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు నియోజకవర్గంలోఆనందం వ్యక్తం చేశారు.

# సెజ్ పునరావాస కాలనీ అభివృద్ధికి చర్యలు

» ఎమ్మెల్యే విజయకుమార్ వెల్లడి » 'ఆంధ్రజ్యోతి' కథనంపై వెనువెంటనే స్పందన

» వేకువనే గ్రామానికి ఒంటరిగా పయనం » సాయంత్రం అధికారులతో కలిసి సమీక్ష



పునరావాస కాలనీలో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సెజ్ పునరావాస కాలనీ (దిబ్బపాలెం పంచాయతీ)ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. 'సెజ్ పునరావాస కాలనీలో సమస్యల తిష్ఠ' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో ఆయన వెనువెంటనే స్పందించారు. తెల్లవారుజాము ఆరు గంటలకే బైక్‌పై ఒంటరిగా సెజ్ పునరావాస కాలనీకి చేరుకుని అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. మురుగు కాలువలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను స్వయంగా తీసి బయట వేశారు. పలువుర్ని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాయంత్రం దిబ్బపాలెం పంచాయతీ కార్యాలయం ఆవరణలో బహిరంగ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సెజ్ నిర్వాసితులు తమ భూములు ఇవ్వడం వల్లే ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందన్నారు. అందువల్ల వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవలసిన బాధ్యత నాయకులందరిపై ఉందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ కాలనీని పట్టించుకోక పోవడం వల్లే సమస్యలు పరిష్కారా కాలేదని ఆరోపించారు. పునరావాస కాలనీ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అంతా సహకరించాల్సిందిగా కోరారు. ఇప్పటికే ఈ కాలనీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌తో పాటు విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరయ్యాయన్నారు. కాలనీ వాసులందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ప్రభాకరరావు, నాయకులు బైలపూడి శ్రీరామదాసు, తుమ్మల రాజు, నీరుకొండ నర్శింగరావు, లాలం రాజు, తుమ్మల సుధ, యాండ్ర అప్పలనాయుడు, మడగల శివ తదితరులు పాల్గొన్నారు.

### ఫ్లై ఓవర్ పిల్లర్ల నిర్మాణానికి భూమి పూజ

ఇదిలావుంటే, పారిశ్రామికంగా శరవేగంతో అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లై ఓవర్ పిల్లర్ల నిర్మాణానికి బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే విజయకుమార్ భూమి పూజ చేశారు. అచ్యుతాపురం- అనకాపల్లి రోడ్డు విస్తరణ పనులకు గత నెల 31న మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. అయితే అచ్యుతాపురం జంక్షన్‌లో 530 మీటర్ల పొడవు, 30 మీటర్ల వెడల్పున 19 పిల్లర్లతో ఫ్లైఓవర్ నిర్మించేందుకు ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు.

### చోడమాంబిక జాతర పోస్టర్ ఆవిష్కరణ

అచ్యుతాపురం రూరల్ : చోడపల్లిలో కొలువుదీరిన చోడమాంబిక జాతర పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. రాంబిల్లి మండలం వెంకటాపురం గ్రామంలో గల జనసేన కార్యాలయ ఆవరణలో ఆలయ కమిటీ పెద్దల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల ఏడో తేదీన అమ్మవారి పుట్టుక జాతర ప్రారంభమై 15వ తేదీ వరకూ అత్యంత ఘనంగా జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చోడపల్లి ఆలయ పెద్దలు కర్రి రమణ, వడిశల సన్యాసినాయుడు, లీలా మోహనరావు, కాకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



హరిపురం జనవాణిలో వినతులు స్వీకరణ

### సమస్యల సత్వర పరిష్కారానికే జనవాణి

రాంబిల్లి : ప్రజా సమస్యల పరిష్కారానికి జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే విజయకుమార్ తెలిపారు. మండలంలోని హరిపురంలో గల జనసేన కార్యాలయంలో ఎలమంచిలి నియోజకవర్గ స్థాయిలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలువురి నుంచి వినతులు స్వీకరించారు. పలువురితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విభాగాల వారీగా అధికారులకు అందజేసి, సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయమాధవి, ఈవోపీఆర్‌డీ రాజు, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల టీడీపీ, జనసేన మండల శాఖల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకరన్నదొర, బైలపూడి శ్రీరామదాసు, పలు శాఖల అధికారులు, పలు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## 'డ్వాకా మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి'

» డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి



డ్వాక్రా మహిళల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

ఎలమంచిలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా సంఘాల మహిళలంతా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని తద్వారా స్వయం సమృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి సూచించారు. మండలంలోని లైనుకొత్తూరులో గల స్త్రీశక్తి భవనంలో బుధవారం ఏర్పాటైన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. ప్రతి మహిళ ఆర్థిక ప్రగతి సాధించేందుకు కార్యాచరణ రూపొందించుకుని అందుకు అనుగుణంగా శ్రమించాలన్నారు. అనంతరం గ్రామంలోని ఐదు నుంచి ఎనిమిది సంఘాలకు ఒక ఎన్యూమరేటర్‌ను ఎంపిక చేశారు. ఎన్యూమరేటర్ పర్యవేక్షణలో సంఘాల అభివృద్ధికి దోహదపడేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు వరప్రసాద్, కుమారస్వామి, ఏపీఎం రాణి, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలకు వార్షిక రుణం, మెరుగైన జీవనోపాధిపై ప్రణాళికలు రూపొందించే అంశానికి సంబంధించి మొదటి విడతగా 60 మంది ఎన్యూమరేటర్లు, వీవోఏలకు శిక్షణ శిబిరం బుధవారం ప్రారంభమైంది. జీవనోపాధి ఏర్పాటుకు, కుటుంబ సభ్యులు అవసరాలకు కావాల్సిన రుణ ప్రణాళిక తయారు చేయడంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. డీఆర్‌డీఏ అదనపు పీడీ జి.డైసీ, ఏపీఎంఎస్ శ్రీనివాసరావు, సీసీలు శ్రీను, రమేష్, రాంబాబు, సరోజిని, పద్మావతి, మహేష్ పాల్గొన్నారు.

## శ్రీరామ నవమి వేడుకలకు ముహూర్తపు రాట



మునగపాకలో ముహూర్తపు రాట వేస్తున్న భక్తులు

మునగపాక, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం మునగపాక సంతబయ లులోని తంపర మూల రామాలయం ఆవరణలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని బుధవారం ముహూర్తపు రాట వేశారు. ఈ నెల ఆరో తేదీ ఆదివారం ఈ వేడుక జరగనున్న నేపథ్యంలో వేకువనే స్వామివారికి పూజలు నిర్వహించిన అనతంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ రాటోత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జగన్, విల్లూరి సకిరమ్మనాయుడు, పెంటకోట శివ గణేశ్, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### కొత్తపేటలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

రాంబిల్లి : మండలంలోని కొత్తపేటలో నూతనంగా నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి. ఇందులో భాగంగా నాలుగో తేదీన రామాలయం ప్రారంభం, గణపతి దాత్తాత్రేయ, ఆంజనేయ, లక్ష్మణ సహిత సీతారామ చంద్రమూర్తి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు 272 మంది హాజరు

ఎలమంచిలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి బుధవారం ఇక్కడి మునిసిపల్ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారుల ఎంపికకు ఇంట ర్వ్యూలు నిర్వహించారు. కమిషనర్ ప్రసాదరాజు, వివిధ బ్యాంకుల అధికారులు హాజరై దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు జరిపారు. మొత్తం 328 మంది దరఖాస్తులు చేయగా, 272 మంది ఇంట ర్వ్యూలకు విచ్చేశారు. వీరికి ఆయా అధికారులు ఇం టర్వ్యూలు జరిపారు. నిబంధనల ప్రకారం అర్హులకు రుణాలు ఇవ్వాలని మునిసిపల్ కమిషనర్ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం పద్మావతి, సీవోలు రమణ, సత్య, కృష్ణవేణి, వెల్ఫేర్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌పీసీలపై తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్ నరసింహమూర్తితో మాట్లాడుతున్న వెంకటేశ్

నక్కపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట గ్రామంలో నివసిస్తున్న వారందరికీ ఎల్‌పీసీలు ఇచ్చి న్యాయం చేయాలని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ బుధవారం తహసీల్దార్ నరసింహమూర్తిని కోరారు. రాజయ్యపేట గ్రామ పంచాయతీలో మూడో వంతు గ్రామం అటవీశాఖ పరిధిలో వున్నందని ఎల్‌పీసీలు ఇవ్వడానికి ఇబ్బందులు పెడుతున్నారని తహసీల్దార్‌తో ఆయన చెప్పారు. ఈ విషయమై పరిశీలిస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిక్కి సత్తియ్య, పిక్కి రాంబాబు, పిక్కి గంగరాజు, సిరిపిల్లి అప్పలరాజు, యజ్జల బంగారి పాల్గొన్నారు.

## ఎల్‌టీ.కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కారం



లింగాలతోట కాలనీలో డ్రైనేజీ ఏర్పాటుపై చర్చిస్తున్న వీఎంఆర్డీఏ అధికారులు

పాయకరావుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎల్‌టీ.కాలనీలో వీఎంఆర్డీఏ నిధులు రూ.కోటితో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు వీఎంఆర్డీఏ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ వి.భవానీశంకర్ ఆధ్వర్యంలో ఈఈ ఎన్.రాంబాబు, డీఈఈ యూవీఎస్ఆర్.ప్రసాద్, ఏఈ ఏఎస్.నాయుడు బృందం బుధవారం పాయకరావుపేటలోని ఎల్‌టీ.కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో కాలువల నిర్మాణం, అవుట్‌లెట్లు ఏర్పాటు తదితర అంశాలపై స్థానిక నాయకులు, అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫణివర్మతోపాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, వార్డుసభ్యురాలు దేవాది మంగాదేవి, వీసం మహేష్, లెక్కల గోవిందు, పెదిరెడ్డి నాగవెంకటరమణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

ఎస్.రాయవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రాయవరం, కొరుప్రోలు సబ్ స్టేషన్ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాజవేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఎస్.రాయవరం ఎంహెచ్‌క్యూ, 11 కేవీ వమ్మవరం ఫీడర్లకు చెందిన ఎస్.రాయవరం టౌన్, బసవపాడు, లింగరాజుపాలెం, కర్రివానిపాలెం, వెంకటాపురం, సైతారుపేట, సర్వసిద్ధి, వేమగిరి, పేటసూదిపురం, వాకపాడు, జేవీ పాలెం, వమ్మవరం, గెడ్డపాలెం గ్రామాలతో పాటు కొరుప్రోలు ఏజీఎల్ ప్రాంతాలకు గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన చెప్పారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని చెప్పారు. ఆయా గ్రామాల వినియోగదారులంతా విషయం గమనించి తమకు సహకరించాలని ఈఈ కోరారు.

# ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

» జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి.మోహన్‌రావు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి.మోహన్‌రావు

పాయకరావుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి.మోహన్‌రావు అధికారులను ఆదేశించారు. స్థానిక వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయంలో పాయకరావుపేట డివిజన్ పరిధిలోని ఐదు మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, ఆర్ఎస్‌కే సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అవకాశం ఉన్నచోట వేసవిలో అపరాలు, నువ్వులు, రాగులు పండించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. అదే విధంగా వ్యవసాయశాఖ ద్వారా రాయితీపై పనిముట్లు, సూక్ష్మపోషకాలు, విత్తనాలు రైతులకు అందించేందుకు గ్రామాలవారీగా ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. రైతులకు నికర ఆదాయం పెరిగేలా మేలైన యాజమాన్య పద్ధతులు పాటించేలా అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఏవోలు ఆదినారాయణ, రాజకమల్, ఉమాప్రసాద్, సరోజిని, చిరంజీవిరావు, ఐదు మండలాల ఏఈవోలు, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

# బాలల పరిరక్షణ కమిటీతో చిన్నారులకు రక్ష

» జిల్లా మోనటరింగ్ ఆఫీసర్ లోవరాజు



సమావేశంలో మాట్లాడుతున్న బాలల పరిరక్షణ సమితి ప్రతినిధి లోవరాజు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న బాలల పరిరక్షణ కమిటీలతో 18 ఏళ్ల లోపు గల బాల, బాలికలకు రక్షణగా నిలుస్తాయని జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రతినిధి, బాలల పరిరక్షణ కమిటీల జిల్లా మోనటరింగ్ ఆఫీసర్ డి.లోవరాజు అన్నారు. మండలంలోని కొరుప్రోలు సచివాలయంలో బుధవారం విలేజ్ చైల్డ్ ప్రొటక్షన్, వెల్ఫేర్ నూతన కమిటీ ఏర్పాటు చేసి, కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లోవరాజు మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ అధ్యక్షుడిగా, మహిళా పోలీసు కార్యదర్శి, ఏఎన్ఎం తదితరులతో కూడిన 11 మంది సభ్యులతో ఈ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కమిటీల ద్వారా 18 ఏళ్ల లోపు వయసు గల పిల్లల సమస్యలు తెలుసుకోడం. చైల్డ్ మ్యారేజ్, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు పిల్లలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. అలాగే బడి బయట పిల్లలను గుర్తించడం జరుగుతుందన్నారు. పిల్లలతో పనులు చేయించడం నేరమని, ఆ విధంగా బాలకార్మికులతో పనిచేయించినట్టు ఎవరికైనా తెలిస్తే 100, 1098, 112 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. అలాగే అనాథ పిల్లలతో పాటు 12 రకాల కేటగిరికి చెందిన పిల్లలకు కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్యం పథకంగా ద్వారా ఆర్థిక సహాయం అందజేయడమే కాకుండా పిల్లలు లేని వారికి కావలిస్తే ప్రభుత్వమే పిల్లలను దత్తతకు ఇస్తుందని ఆయన తెలిపారు. అలా కాకుండా ఎవరైనా అక్రమంగా పిల్లలను దత్తత తీసుకోవడం జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామంటూ లోవరాజు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జీడీపంటకు రూ.16 వేలు మద్దతు ధర కల్పించాలని ఆందోళన

కోటవురట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీకేపల్లి గ్రామ సచివాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో జీడిమామిడి రైతులు బుధవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. జీడిమామిడి బస్తాకు రూ.16 మద్దతు ధర కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ రైతు సేవాకేంద్రాల ద్వారా జీడిపిక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ వ్యాపారుల చేతుల్లో రైతులు దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.25 వేలు నుంచి రూ.30 వేలు వరకు పెట్టుబడి పెట్టినప్పటికీ, వాతావరణంలో మార్పుల కారణంగా జీడీపూత మాడిపోయిందని వాపోయారు. దీంతో పెట్టిన పెట్టుబడులు రాక రైతులు అప్పులు పాలవుతున్నారన్నారు. మరోవైపు ప్రైవేట్ మోసాలకు రైతులు నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీడీరైతులను ఆదుకోవాలన్నారు. పంటకు ఉచితంగా బుధవారం బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్యనారాయణ, ఎ.రాజేశ్, ఎస్.కొండబాబు, పోతురాజు పాల్గొన్నారు.

## గ్రావెల్ తవ్వకాలపై తహసీల్దార్ ఆరా



గ్రావెల్ తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

ఎస్. రాయవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జంగులూరు పంచాయతీ పరిధిలోని వెలంపాలెంలో ఉన్న కొండకు అతి సమీపంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేపట్టిన ప్రాంతాన్ని తహసీల్దార్ జె.రమేష్‌బాబు 'వెలంపాలెంలో గ్రావెల్ అక్రమ దందా' అనే శీర్షికతో బుధవారం పరిశీలించారు. 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురించిన కథనానికి ఆయన వెనువెంటనే స్పందించారు. ఇందులో భాగంగా తవ్వకాలు జరిపిన ప్రదేశానికి ఆయన వెళ్లి చూశారు. అలాగే అక్కడికి సమీపంలో ఉన్న ఓ లేఅవుట్‌లో గ్రావెల్‌తో ఉన్న స్థలాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ లేఅవుట్‌లోని గ్రావెల్‌తో నింపి ఉన్న స్థలానికి చెందిన వారిపై కేసు పెట్టడంతో పాటు అక్రమంగా తవ్వకాలు చేపట్టిన వారిని గుర్తించి చర్యలు చేపడతామని తెలిపారు. ఇదిలావుంటే మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు అక్రమ తవ్వకాలు నిర్వహించారని స్థానికులు తెలిపారు.

## ఆటిజంపై అవగాహన ర్యాలీ

పాయకరావుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) పట్టణంలో ఆటిజంపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్.వాడ పాఠశాల ఆవరణలోని భవిత సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో ఎంఈవో-2 రమేష్‌బాబు మాట్లాడుతూ మందబుద్ధిగల పిల్లలకు ఫిజియోథెరపీతో పాటు వారిలో చైతన్యం తెచ్చేందుకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. పిల్లలను గుర్తించి, వారి భవిష్యత్ కోసం భవిత సెంటర్‌లో చేర్పించాలని కోరారు. అనంతరం ఆటిజం రావడానికి కారణాలు, నివారణ మార్గాలు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అనంతలక్ష్మి, ప్రత్యేక ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సంపద కేంద్రాల తనిఖీ

నక్కపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లిపూడి, బంగారమ్మపేట, అమలాపురం గ్రామాల్లో సంపద కేంద్రాలను బుధవారం ఎంపీడీవో సీతారామరాజు తనిఖీ చేశారు. ఇంటింటా ప్రజలకు అవగాహన కల్పించి, తడి, పొడి చెత్తను సేకరించి, సంపద కేంద్రాలకు తరలించాలని గ్రీన్ అంబాసిడర్లను ఆదేశించారు. వర్క్ ఫర్ హోం సర్వే కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. ఈవోఆర్‌డీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ హెచ్‌ఎంకు సత్కారం

నక్కపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకయ్యపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎం.త్రినాథరావు పదవీ విరమణ చేయడంతో బుధవారం గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ హెచ్ఎం త్రినాథరావు దంపతులను గ్రామ పెద్దలు కురందాసు నూకరాజు, సింహాచలం, అప్పలరాజు, దేవర సత్తిబాబు, అప్పలరావు, రామకృష్ణ తదితరులు దుశ్శాలువతో సత్కరించారు.

## గ్రామాల్లో చలివేంద్ర కేంద్రాలు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్ర కేంద్రాలు ఏర్పాటు ఏర్పాటు చేశారు. శ్రీరాంపురం, పాల్తేరు, వెంకటనగరం, రాజవరం, పెదరాంభద్రపురం గ్రామాలలో వీటిని ఏర్పాటు చేసినట్టు ఈవోపీఆర్డీ చంద్రశేఖరరావు తెలిపారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరాంపురం కార్యదర్శి వైవీ.సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



శ్రీరాంపురంలో ఏర్పాటుచేసిన చలివేంద్రం



అమ్మవారిని దర్శించుకుంటున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి

## నూకాలమ్మకు స్పీకర్ ప్రత్యేక పూజలు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లింగంపేట నూకాలమ్మ తల్లిని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టుచీర, పసుపు, కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో దుకాణాలను సందర్శించి వ్యాపారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ నూకాలమ్మను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని 101 పంచాయతీల్లో భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమిని నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో దివ్యజ్యోతి, టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారక వేణుగోపాల్, చోద్యం సర్పంచ్ ఎ.గోపాలకృష్ణ, నాయకులు చిటికెల సాంబమూర్తి, గెడ్డం సత్యనారాయణ, పరవాడ అప్పలనాయుడు, జి.శ్రీకాంత్, మరిశా రమణ, దేముడు పాల్గొన్నారు.

## కార్యదర్శులపై పనిభారం తగ్గించాలి

» ఎమ్మెల్యేకు మండల కార్యదర్శుల సంఘం వినతి



ఎమ్మెల్యే రాజుకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

రావికమతం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులపై పని భారం తగ్గించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే రాజుకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని 28 పంచాయతీల్లో 19 మంది కార్యదర్శులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని, ప్రతీ సర్వేను కార్యదర్శులకే అప్పగిస్తున్నారని, దీనివల్ల పనిభారం అధికమై ఇబ్బందు లకు గురవుతున్నామని చెప్పారు. ఈ విషయంలో స్పందించాలని కోరారు.

## మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

» మత్స్య శాఖ అభివృద్ధి అధికారి నాగమణి



సమావేశంలో మాట్లాడుతున్న మత్స్య శాఖ అధికారి నాగమణి

చీడికాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని మత్స్య శాఖ అభివృద్ధి అధికారి వి.నాగమణి చెప్పారు. మండలంలోని శ్రీకోగొండమ్మ జలాశయం వద్ద సంఘం అధ్యక్షుడు కిముడు దేముడు అధ్యక్షతన బుధవారం మత్స్యకారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జలాశయంపై ఆధారపడ్డ మత్స్యకారులు చేపలు పట్టుకొని అమ్మకానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి ఏడాది ప్రభుత్వం చేప పిల్లలను ఉచితంగా అందిస్తున్నదని, మరికొన్ని చేప పిల్లలను సంఘం ద్వారా సమకూర్చుకుని జలాశయంలోకి వేసుకుంటే మరింత ఆదాయం సమకూరుతుందని చెప్పారు. భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీ మత్స్యకారులకు ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏడీ విజయకృష్ణ, ఫీల్డ్‌మన్ శ్రీకాంత్, చోడవరం సహకార శాఖ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ కుమార్, సంఘం ఉపాధ్యక్షుడు ఎ.అచ్చింనాయుడు, కార్య నిర్వాహక కార్యదర్శి ఎస్.తాతాలు, కార్యదర్శి ఆర్.దేముడు పాల్గొన్నారు.

## రుణాల లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు




లబ్ధిదారుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

నర్సీపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఓసీ, ఈబీసీ కార్పొరేషన్ రుణాల కోసం లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయంలో బుధవారం స్వయం ఉపాధి కోసం వివిధ వ్యాపారాలు, వాహనాలు కొనుగోలుకు దరఖాస్తు చేసుకున్న 300 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ఎస్‌బీఐ ఏడీబీ, మెయిన్ బ్రాంచి, బజార్ బ్రాంచి, ఆంధ్రా బ్యాంకు, నర్సీపట్నం, పెదబొడ్డేపల్లి ఏపీజీవీబీ అధికారులు ధ్రువపత్రాలు పరిశీలించారు. కమిషనర్ సురేంద్ర పాల్గొన్నారు.

### బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో కార్పొరేషన్ రుణాల మంజూరుకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 140 యూనిట్లకు 632 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోగా, వారికి ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరిగాయి. కాగా, బ్యాంకర్లు వచ్చేవరకూ మహిళలు ఎండలో పడిగాపులు కాశారు. చంటి పిల్లల తల్లులు, దివ్యాంగులు, గృహిణులు నరకం చూపించారు. ఎంపికైన లబ్ధిదారుల జాబితాను త్వరలో ప్రకటిస్తామని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో సీతయ్యపేట ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, రాజాం బ్యాంకు మేనేజర్ మృదుల, వడ్డాది ఎస్‌బీఐ, బుచ్చెయ్యపేట ఐవోబీ సిబ్బంది లబ్ధిదారులను ఎంపిక చేశారు.

## అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



గుర్తు తెలియని మృతదేహం

కృష్ణాదేవిపేట , ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లింగంపేట పంచాయతీ పరిధిలోని గైరంపేట గ్రామంలో అనాథ శవానికి బుధవారం సాయంత్రం అంత్యక్రియలు చేశారు. నూకాలమ్మ జాతర సందర్భంగా గుడి వద్ద భిక్షాటన చేస్తున్న గుర్తుతెలియని వ్యక్తి (45) బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. సర్పంచ్ తోకల సంతోశ్‌కుమార్, కృష్ణాదేవిపేట పోలీసులు గుర్తించి అంత్యక్రియలు చేశారు. పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### రూ.52 కోట్ల ఉపాధి పథకం బకాయిలు చెల్లించాలి

దేవరాపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.52 కోట్ల బకాయిలు చెల్లించాలని వ్యవసాయ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న తెలిపారు. పనులకు బిల్లులు చెల్లించకపోతే అధికారులపై కేసులు పెట్టే సౌలభ్యం కల్పించినట్టు ఆయన చెప్పారు.

# సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

» చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



ప్రజా సమస్యల పరిష్కార వేదికపై అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

రోలుగుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సూచించారు. మండల పరిషత్‌కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ గ్రీవెన్స్‌కు మండలంలోని 24 పంచాయతీల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, నాయకులు తరలివచ్చి వివిధ సమస్యలపై వినతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ వారం గ్రీవెన్స్ డే నిర్వహించి సమస్యలపై వచ్చిన దరఖాస్తులపై సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని వర్గాల వారికి అందేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరరావు, తహసీల్దార్ నాగమ్మ, టీడీపీ నేత జి.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

### అధికారులు అందించే సేవలను ప్రజలు గుర్తుంచుకోవాలి

రావికమతం: అధికారులు అందిచే సేవలను ప్రజలు గుర్తు చేసుకునేలా ఉండాలని ఎమ్మెల్యే రాజు చెప్పారు. మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదన్నారు. ఇందుకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని, కార్యాలయానికి వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే సమస్య పరిష్కరించే సమయం చెప్పి, వారి ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పవద్దని హితవు పలికారు. ఇకపై ప్రతి బుధవారం రావికమతంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక నిర్వహిస్తామన్నారు. అధికారులు కూడా ఆ దిశగా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు.

అంతకుముందు గెంజివారి దేవాలయంలో కార్యకర్తలతో ఎమ్మెల్యే రాజు సమావేశం నిర్వహిం చారు. వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా ప్రజల పట్ల దురుసు వ్యవహరించవద్దని, అందరితోనూ స్నేహపూర్వకంగా మెలగాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే విధంగా ఏ ఒక్కరూ వ్యవహరించరాదని స్పష్టం చేశారు. అనంతరం రాయితీపై వచ్చిన రెండు వరి నూర్పుడు యంత్రాలను మేడివాడ గ్రామానికి చెందిన గొల్లవిల్లి రమణ, విరోతి నాయుడుకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.వెంకటరమణ, ఎంపీడీవో వెంకన్నబాబు, మండల వ్యవసాయాధికారి పి.రూప, టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, ఉప సర్పంచ్ గెంజి మోదినాయుడు, ఎంపీటీసీ సభ్యులు వి.లక్ష్మి, గెంజి సూర్యనారాయణ, సీపీఎం నాయకులు కోట గోవిందరావు, మండల స్థాయి అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

# ఆక్రమిత భూములను గుర్తించండి

» ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు



ప్రజ సమస్యల పరిష్కార వేదికపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణకు గురైన ప్రభుత్వ, గ్రామ కంఠం భూములను గుర్తించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 67 వచ్చిన వినతులను ఎమ్మెల్యే స్వీకరించారు. అలాగే వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారం కాని సమస్యలపై ఆయా శాఖల అధికారులను ప్రశ్నించారు. వినతుల్లో అత్యధికంగా గ్రామకంఠం భూములు ఆక్రమణకు గురయ్యాయని, ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదని ఎమ్మెల్యేకు తెలిపారు. అలాగే తమ భూమిలో తామే సాగు చేస్తున్నప్పటికీ, అధికారులను అడ్డంపెట్టుకొని కొంతమంది వన్‌బీలు చేయించుకొని దౌర్జన్యానికి పాల్పడుతున్నారని తాటిపర్తి పంచాయతీ కాశీపురం గ్రామానికి చెందిన ఓ మహిళ ఆధారాలతో ఫిర్యాదు చేశారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ భూమి ఒకరిదైతే, మరొకరికి ఎలా వన్‌బీ ఇచ్చారని మండిపడ్డారు. ఆ వన్‌బీని వెంటనే రద్దుచేసి భూమిని సర్వే చేయాలని, ఆ సమయంలో ఎవరైనా గుండాయిజం చేసి అడ్డుకుంటే కేసు పెట్టాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. మాడుగుల గ్రామంలో 3.93 సెంట్ల గ్రామకంఠం కబ్జాకు గురైనా అధికారులు పట్టించుకోలేదని ఎస్.ప్రసాదరావు, ఎం.ఈశ్వరరావు ఆరోపించారు. అనంతరం ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ప్రజలు ఎన్నో అవస్థలు పడుతూ కార్యాలయాలకు వస్తున్నారని, అధికారులు సానుకూలంగా సమస్య పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. అలాగే ఫిర్యాదుదారులకు న్యాయంచేసే దిశగా పనిచేసే అధికారులను ఎవరైనా బెదిరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.రమాదేవి, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఎస్ఐ నారాయణరావు, ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.జగ్గారావు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

» ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ

మాడుగుల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ తెలిపారు. విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టేందుకు గురువారం, శుక్రవారం ఉదయం 7:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. మాడుగుల, ఘాటీరోడ్డు, వాడపాడు, వీరనారాయణం, జి.అగ్రహారం, చింతలూరు, జంపెన, డి.సురవరం గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

### ఆధారాలు అందిస్తే ఇంటి పట్టా మంజూరు

చీడికాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టుకున్న వారికి సంబంధించిన ఆధారాలు అందిస్తే ఇంటి పట్టాను మంజూరు చేస్తామని తహసీల్దార్ కిశోర్‌లింకన్ తెలిపారు. తన చాంబర్‌లో వీఆర్‌వోలు, సచివాలయాల సర్వేయర్‌లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఇటువంటి వారిని గుర్తించాలని సూచించారు. కరెంటు బిల్లు, దరఖాస్తు తీసుకువస్తే వారికి ఇంటి పట్టా మంజూరు చేస్తామన్నారు. నీటి పన్ను వసూళ్లు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం.రాజ, సర్వే డిప్యూటీ తహసీల్దార్ త్రివేణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

### పశువుల నీటి తొట్టెల నిర్మాణాలకు శంకుస్థాపన

మాకవరపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 గ్రామాల్లో పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణాలు చేపడుతున్నట్టు ఎంపీడీవో సీతాహహాలక్ష్మి చెప్పారు. భీమబోయినపాలెం గ్రామంలో బుధవారం వీటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో పశువులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా తొట్టెల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. తొలి విడతగా 14 గ్రామాల్లో రూ.35 వేలు నుంచి రూ.45 వేలతో ఒక్కొక్క తొటె నిర్మిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రుత్తల నందకిశోర్, ఏపీవో వరలక్ష్మి పాల్గొన్నారు.

### భూమిలోకి చొరబడిన వ్యక్తులపై చర్యలకు వినతి

నాతవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తన భూమిలోకి కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా చొరబడి బెదిరిస్తున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని ఎంబీపట్నం గ్రామానికి చెందిన శెట్టి నాగమని కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రం నాతవరంలో ప్రతీ శనివారం ఎస్ఐ, తహసీల్దార్, మండల ప్రత్యేకాధికారి నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కర వేదికలో పాల్గొన్నారు.

### కర్రి శ్రీను అరెస్టు అక్రమం: మాజీ ఎమ్మెల్యే

నర్సీపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత కర్రి శ్రీనును ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ ఆరోపించారు. బుధవారం శ్రీను అరెస్టు సమాచారం తెలుసుకున్న ఆయన కుటుంబ సభ్యులను కలిశారు. అరెస్టు ఉదంతానికి సంబంధించిన సమాచారం శ్రీను సోదరుడు సత్తిబాబును అడిగి తెలుసుకున్నారు.

### నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 2 (బుచ్చెయ్యపేట): మండలంలోని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ బుచ్చెయ్యపేట నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బోని అప్పలనాయుడు, ఎంవి.నూకేష్‌లు నియమితులయ్యారు. వీరికి ఎంఈవోలు బొంజుబాబు, బుద్ధ కాశీవిశ్వేశ్వరరావు ఎంపికయ్యారు. అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రమణ, శ్రీను, ఉపాధ్యక్షులుగా రాజ, రమేశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.

### విద్యార్థులకు వడదెబ్బ నివారణ మాత్రలు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది మెయిన్ పాఠశాలలో విద్యార్థులకు ముందస్తు చర్యల్లో భాగంగా వడదెబ్బ తట్టుకునేందుకు ఉచితంగా హోమియో మందులను బుధవారం పంపిణీ చేశారు. అతిథి దేవో భవ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ మాత్రలను పంపిణీ చేశారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. దిబ్బిడి, నేతవానిపాలెం పాఠశాలల్లోనూ మందులు అందజేశారు. హెచ్ఎంలు టివి.శేషగిరిరావు, పివిజె.అప్పారావు పాల్గొన్నారు.

## విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

» మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు




2ఎంకేపీ3సమావేశంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనువాసరావు

మాకవరపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సమయాన్ని వృథా చేయకుండా విద్యార్థులు విన్నూత ఆలోచనలు చేయాలని అవంతి కాలేజీ చైర్మెన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. కాలేజీ 25వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఈ కాలేజీ ద్వారా పేద విద్యార్థులు ఇంజనీర్లను తయారు చేసినట్టు చెప్పారు. విద్యార్థులకు ఉద్యోగ సాధన ఆధారిత శిక్షణ అందిస్తూ ఎన్నో కుటుంబాల్లో ఆర్థికి స్థితిని మెరుగుపరిచిందన్నారు. వార్షికోత్సవ వేడుకుల్లో భాగంగా విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, ఖోఖో, 400 మీటర్ల పరుగు పందెం వంటి ఆటలు నిర్వహించారు. సూర్యప్రకాశ్, అంవతి కాలేజీల అద్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజుపేట చెరువులో ఆక్రమణల తొలగింపు



చెరువుకు గట్టు ఏర్పాటు చేస్తున్న అధికారులు

గొలుగొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లేడపూడి చెరువులో ఆక్రమణలను ఎస్ఐ రామారావు, రెవెన్యూ సిబ్బంది బుధవారం తొలగించారు. ఈనాం భూముల్లోని సర్వే నంబరు 16/1లో 7.8 ఎకరాల విస్తీర్ణంతో ఉన్న రాజుపేట చెరువును కొంత మంది ఆక్రమించుకున్నారని గతంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. చెరువు గర్భాన్ని సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించే కార్యక్రమం చేపడుతుండగా, అదే గ్రామానికి చెందిన కన్నూరి సత్యనారాయణ అడ్డగించారు. రికార్డులు తీసుకురావాలని అధికారులు ఆయనకు స్పష్టం చేశారు. చెరువు ఆక్రమణలు తొలగించి హద్దుల్లో గట్టు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కొండబాబు, వీఆర్‌వో మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

## నూకాలమ్మ ఆలయంలో సీసీ కెమెరాలు



కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్న ఎస్ఐ, ఈవో

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లింగంపేట నూకాలమ్మ ఆలయంలో బుధవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రామ శివారులో ఆలయం ఉండడంతో దొంగతనాలు జరగవచ్చని ఎస్ఐ వై.తారకేశ్వరరావు గుర్తించి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని దేవదాయ శాఖ అధికారులను కోరారు. ఈ మేరకు దేవదాయ శాఖ ఈవో టి.దివ్యతేజ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దీంతో దొంగతనాలకు తావుండదని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఏరియా ఆస్పత్రిలో కాయకల్ప బృందం తనిఖీలు



ఏరియా ఆస్పత్రి అత్యవసర విభాగంలో కాయకల్ప బృందం

నర్సీపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయాస్పత్రిలో కాయకల్ప రాష్ట్ర బృందం సభ్యులు సందర్శించారు. బుధవారం డాక్టర్ సోనియా మనోహర్, వేణు ఆస్పత్రిలోని పలు విభాగాలు తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలు, అత్యవసర విభాగం, బ్లడ్ సెంటర్, ఎస్ఎన్‌సీయూ, గైనికాలజీ, రక్త పరీక్షా కేంద్రం, ఫార్మసీ, జనరల్ వార్డులు తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుదాశారద పాల్గొన్నారు.

## భూ ఆధార్ రిజిస్ట్రేషన్‌తోనే ప్రభుత్వ రాయితీలు

» వ్యవసాయ శాఖ ఏడీ శ్రీదేవి

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భూ ఆధార్ రిజిస్ట్రేషన్‌తో ప్రభుత్వ రాయితీలు అందుతాయని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు టి.శ్రీదేవి స్పష్టం చేశారు. గొలుగొండ మండలంలోని చోద్యం రైతు సేవా కేంద్రంలో బుధవారం వ్యవసాయ శాఖ గ్రామ సహాయకులు, హార్టికల్చర్ అసిస్టెంట్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతీ రైతు భూ ఆధార్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అలాగే ఖరీఫ్ రైతులకు సరిపడా విత్తనాల అంచనా ప్రణాళిక గురించి వివరించారు. ప్రస్తుతం మండలంలో ప్రకృతి వ్యవసాయం చేసే గ్రామాల్లో జరిగే వివిధ ప్రణాళికలు, పీఎండీఎస్ కిట్లపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో సిబ్బంది పనితీరులపై సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండలం వ్యవసాయాధికారి కె.సుధారాణి పాల్గొన్నారు.

## కార్మికుల భద్రతకు చట్టం చేయాలి

» సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ

చోడవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికుల భద్రతకు సమగ్ర రక్షణ చట్టం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. బుధవారం కల్యాణ మండపంలో రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన మహాసభలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మికులకు, రైతులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు, మండల కార్యదర్శిగా సోమాదుల దేవి, సహాయ కార్యదర్శిగా విస్సారపు నాగూర్‌లను ఎన్నుకున్నారు. ఈ సభలో సీపీఐ జిల్లా నాయకులు రామానాయుడు, రాజాన దొరబాబు మాట్లాడారు మహాసభలో కిల్లి లక్ష్మయ్య, ద్వారపూడి నాగేశ్వరరావు, సీపీఐ కార్యకర్తలు సానుభూతిపరులు పాల్గొన్నారు.

### నేడు కార్యకర్తలతో ఎమ్మెల్యే

చోడవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే రాజు కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈ కార్యక్రమం ఉంటుందని, కార్యకర్తలు తమ వినతులు సమస్యలు దరఖాస్తురూపంలో కాగితంపై రాసి సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 32పంచాయతీల నుంచి పంచాయతీకి ఆరుగురు చొప్పున కార్యకర్తలు నాయకులు హాజరుకావాలని గంగాధర్ సూచించారు.

### ఆటిజం డేపై అవగాహన ర్యాలీ

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం గ్రామంలో జాతీయ ఆటిజం డే సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం దివ్యాంగ బాల, బాలికలకు ఆటలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఎం వరలక్ష్మి, ప్రత్యేక ఉపాధ్యాయుడు మాణిక్యం మాట్లాడుతూ ఆటిజం కలిగిన పిల్లలు ప్రత్యేకంగా ఉంటారని, వారిని గుర్తించి విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రావికమతంలో...

రావికమతం: మేడివాడ హైస్కూల్‌లో దివ్యాంగ విద్యార్థులకు ఆటిజం వ్యాధిపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. బుధవారం ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు బహుమతులు అందిస్తారు. పోటీలలో ప్రతిభ చూపిన దివ్యాంగ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం మేడివాడ హైస్కూల్ హెచ్ఎం వంకాయల రామారావు మాట్లాడుతూ ఆటిజం వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలన్నారు. ఆటిజంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

### బుచ్చెయ్యపేట...

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఆటిజంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు బీఏ.రాజు ఆటిజం రావడానికి గల కారణాలు, లక్షణాలు వివరించారు. జన్యుపరమైన కారణాల వల్ల ఆటిజం వస్తుందని తెలిపారు. బుచ్చెయ్యపేట భవిత కేంద్రంలో ఆటిజంపై ఎంఈవో-2 బి.కార్తీక్ మాట్లాడుతూ మానసిక పరిపక్వతలేని పిల్లలపై తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచి ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. ప్రత్యేక ఉపాధ్యాయులు పోతురాజు, దేముడు, హెచ్ఎం రఘురాం తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులను ఆదుకోవాలి

మాకవరపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను ప్రభత్వం అన్ని విధాలా ఆదుకోవాలని నిరాధార దివ్యాంగ వయోవృద్ధుల పునరావాస కేంద్రం అధ్యక్షుడు సతీశ్ చెప్పారు. సంస్థ ఏర్పాటు చేసి ఏడాది పర్తికావడంతో బుధవారం మాకవరపాలెంలో దివ్యాంగల కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగుల సంస్థ భవనం నిర్మానానికి నిధులు మంజూరు చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణం హామీ ఇచ్చారన్నారు. అనంతరం 50 మంది దివ్యాంగులకు సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు సిహెచ్.గోపి, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

### నాతవరంలో చీరల పంపిణీ

నాతవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నాతవరంలోని అమ్మవాసవి సేవ సంఘం ఆధ్వర్యంలో కొంతమంది మహిళలకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు మాట్లాడుతూ అమ్మవాసవి సేవ సంఘం వారు ఏడాదిలో కొందరి పేదలకు సేవలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అమ్మవాసవి సేవ సంఘం అధ్యక్షురాలు ఇటంశెట్టి అక్కయ్యమ్మ, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు పేరూరి బుల్లిదొర తదితరులు పాల్గొన్నారు.

### ఎన్ఎంయూ నిరసన

నర్సీపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు రెడ్ బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గ్యారేజ్ గేట్ వద్ద నిలబడి సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో, వారు ఆందోళనకు గురవుతారని వాపోయరు.

## అంగన్‌వాడీ కార్యకర్తల ధ్రువ పత్రాల పరిశీలన



అంగన్‌వాడీ కార్యకర్తల విద్యార్హతల పత్రాలు పరిశీలిస్తున్న సీడీపీవో

కొయ్యూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్త, ఆయా, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల విద్యార్హతలతో పాటు నియామక ఉత్తర్వుల కాపీల పరిశీలన కార్యక్రమం బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో విజయ కుమారి నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పరిశీలన చేపడుతున్నారు. గతంలో అంగన్ వాడీ పోస్టుల భర్తీలో నిబంధనకు విరుద్ధంగా కొన్ని ప్రాంతాలలో నియామకాలు జరిగినట్టుగా అందిన పిర్యాదుల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీల ధ్రువ పత్రాలు, ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సమయంలో సమర్పించిన ధ్రువపత్రాలతో సరిపోల్చుతూ పరిశీలన చేస్తున్నారు. ఈ సందర్భంగా కొయ్యూరు ప్రాజెక్టు పరిధిలో జరిపిన నియామకాలన్నీ సక్రమంగా ఉన్నట్టుగా తమ పరిశీలనలో తేలిందని ఈ సందర్భంగా సీడీపీవో తెలిపారు. అనంతరం కార్యకర్తలకు బాల సంజీవని యాప్‌పై అవగాహన కల్పించారు.

## పశువుల కోసం నీటి తొట్టెలు నిర్మాణం: ఎంపీపీ

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పశువుల దాహార్తిని తీర్చేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల నీటి తొట్టెలు నిర్మిస్తున్నట్టు ఎంపీపీ బోయిన కుమారి తెలిపారు. బుధవారం పెదవలస గ్రామ పంచాయతీ కేంద్రంలో స్థానిక సర్పంచ్ కృష్ణ వంశీ ఆధ్వర్యంలో పశువుల నీటి తొట్టె నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలానికి ప్రభుత్వం 22 పశువుల నీటి తొట్టెలను మంజూరు చేసిందన్నారు.కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సప్పగెడ్డ ఆనంద్, దేముళ్లు, నాయకులు నూకరాజు, చిరంజీవి, చిన్నబాబు, త్రిమూర్తులుపాల్గొన్నారు.

## 'వాత్సల్య' నోటిఫికేషన్ రద్దు చేయాలి'

పాడేరురూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ప్రాంతంలో ఆదివాసీ నిరుద్యోగులకు ఉపయోగం లేని శిశు సంక్షేమ విడుదల చేసి మిషన్ వాత్సల్య నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిరసాని కిశోర్, జిల్లా కార్యదర్శి బూడిద మాధవరావు, ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. జిల్లాలో ఈ నోటిఫికేషన్ ద్వారా ఆదివాసీ నిరుద్యోగులకు ఒక్క పోస్టు కూడా కేటాయించక పోవడం తీవ్ర అన్యాయమన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత శాఖ గిరిజనేతరులతో కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తున్నట్టు వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌యూ నాయకులు ఎం.బాబూజీ , గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు నిలుపుదల

డుంబ్రిగుడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కించుమండ పంచాయతీ కేంద్రంలో అక్రమ కట్టడాలను బుధవారం రెవెన్యూ, పంచాయతీ అధికారులు నిలుపు చేశారు. గ్రామానికి చెందిన గిరి జనులు సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లారు. దీంతో ఆర్ఐ రాజు, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ అక్ర మ కట్టడాలను పరిశీలించారు. అనంతరం సంబంధిత నిర్మాణ దారులకు నోటీసులు అందజేశారు.వీఆర్‌వో సింహాచలం, నాయకులు చిరంజీవి, రామనాయుడు పాల్గొన్నారు.

## అన్నసమారాధన

సీలేరు, ఏప్రిల్ 2 , (ఆంధ్రజ్యోతి) : సీలేరులోని సీపీహెచ్ క్యాంప్ వద్ద గల నూకాలమ్మ ఆలయంలో బుధవారం మరుపూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కొత్త అమావాస్య పండుగ అనంతరం ఆలయంలో ఈ పూజ కార్యక్రమంను నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

## పదవీ విరమణ ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

అనంతగిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసినమండలంలోని బొర్రా గిరిజన సంక్షేమ బాలురు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అడపా కొండబాబు బుధవారం సన్మానించారు. ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ, ఎంఈవో కిల్లో బాలజీ, ఇతర ఉపాధ్యాయులు, సంఘ నాయకులు, కొండబాబు సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు రామచంద్ర రావు, భాస్కరరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రాష్ట్ర స్థాయి మెగా క్రికెట్ టోర్నీ ప్రారంభం

పాడేరురూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు మే నెలలో జరగనున్న నేపథ్యంలో 36వ రాష్ట్ర స్థాయి మెగా క్రికెట్ టోర్నీని గురువారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహకులు సీదరి రాంబాబు, కొంటా దుర్గారావు, బాకూరు ఉమామహేశ్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎమ్మెల్యే, ఆలయ, ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఎం.విశ్వేశ్వరరాజు, కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్, జేసీ, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సర్పంచ్‌కొట్టగుళ్లి ఉషారాణి తదితరుల ఆధ్వర్యంలో ఈ పోటీలు ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు.

## యువకుడి అదృశ్యం



అదృశ్యమైన చంటిబాబు(ఫైల్)

పెదబయలు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతగుంట పంచాయతీ రోగుల పేటకు చెందిన శెట్టి చంటిబాబు (18) అదృశ్యమయ్యాడు. వివరాలివి.. మార్చి 26న పాడేరులో వెళ్లిన చంటిబాబు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఈనెల 1న పాడేరు పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. చంటిబాబు ఆచూకీ తెలిస్తే 63002 47619, 9493855423 ఫోన్ నంబర్లకు తెలియజేయాలని వారు అభ్యర్థిస్తున్నారు.

# చింతపల్లి సంతలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

- రహదారికి ఇరువైపులా ఆక్రమణల తొలగింపు
- షెడ్లలోకి దుకాణాల మార్పు



సంతలో షెడ్ల వద్ద దుకాణాలు కేటాయిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు, పంచాయతీ అధికారులు

చింతపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వారపు సంతలో ట్రాఫిక్ సమస్యను పోలీసులు, పంచాయతీ అధికారులు పరిష్కరించారు. నాబార్డు నిధులతో నిర్మించిన షెడ్లలోకి బుధవారం సంతను మార్చేశారు. అక్కడే దుకాణాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. అలాగే, రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలను తొలగించారు. ఆరు నెలల క్రితం రూ.25 లక్షల పంచాయతీ, నాబార్డు నిధులతో నిర్మించిన సంతలో షెడ్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ షెడ్లను పంచాయతీ అధికారులు గతంలో వర్తకులకు కేటాయించినా, నెల రోజులు మాత్రమే వీటిని వినియోగించారు. అనంతరం దుకాణాలన్నీ గతంలోలా రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేశారు. దీంతో షెడ్లు ఖాళీ అయ్యాయి. ఫలితంగా ట్రాఫిక్ సమస్య మళ్లీ మొదటికొచ్చింది. వారపు సంత రోజు పాత బస్టాండ్ నుంచి డిగ్రీ కళాశాల వరకు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వీఐపీ వాహనాలు, అంబులెన్సులు సైతం సంత రోజు ట్రాఫిక్‌లో చిక్కుకుని సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నాయి. ఈ ట్రాఫిక్ సమస్యపై పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఈకథనాలకు స్పందించిన స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. వినోద్ బాబు పంచాయతీ అధికారులో చర్చించి సంత మార్పుకి శ్రీకారం చుట్టారు. స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ వి. వెంకటేశ్వరరావు, పోలీసులు, పంచాయతీ అధికారులు వర్తకులకు కౌన్సెలింగ్ ఇచ్చి సంత మార్పు చేశారు. రహదారికి ఇరువైపులానున్న దుకాణాలన్నీ నాబార్ సంత షెడ్ వద్దకు తరలించారు. దీంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించినట్టయింది. కాగా వచ్చే వారం వర్తకులకు లాటరీ పద్ధతిలో శాశ్వతంగా షెడ్లను కేటాయిస్తామని పంచాయతీ గుమస్తా అంబేడ్కర్ తెలిపారు.

## ఘనంగా శ్రీరామనవమి ఉత్సవాల ముహూర్తపు రాట



ముహూర్తపు రాటకు పూజలు చేస్తున్న భక్తులు

సీలేరు, ఏప్రిల్ 2, (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధి ఏనుగుబైలు గ్రామంలో రామాలయం వద్ద శ్రీరామ నవమి ఉత్సవాల ముహూర్తపు రాట కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అర్చకుడు కొర్రా రాము ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించి ముత్తైదువులు, భక్తుల ఆధ్వర్యంలో ముహూర్తపు రాటను వేశారు. ఈ నెల 6 వతేదీనుంచి శ్రీరామ నవమి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సద్గురు ధర్మపత్ని గొంగలి లక్ష్మి, అల్లూరి జిల్లా సమరసత సేవాఫౌండేషన్ కన్వీనర్ గొర్లి గణేశ్వరరాజు, నడిగట్ల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## జి.మాడుగుల ఎంపీపీ అప్పలరాజు బాధ్యతల స్వీకరణ



కార్యక్రమంలో ఎంపీపీ అప్పలరాజు అభినందిస్తున్న గిడ్డి ఈశ్వరి, తదితరులు

జి.మాడుగుల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల నూతన ఎంపీపీగా ఎన్నికైన లొంబోరి అప్పలరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టీడీపీ పాడేరు నియోజక వర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, మాజీ మంత్రి మణికుమారి, ఏపీటీడీసీ డైరెక్టర్ కిల్లు రమేశ్‌నాయుడు, ట్రైకర్ డైరెక్టర్ కూడ కృష్ణారావు హాజరై ఎంపీపీకి అభినందనలు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులతో గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, పంచాయతీల వారీగా సేవ మిత్రలు వేగంగా నియమించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. సేవ మిత్రలో మహిళకు ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, బొర్రా విజయరాణి, డి.వెంకటరమణ బుజ్జి, లకే పార్వతమ్మ, స్థానిక మండల పార్టీ అధ్యక్షుడు వంతాల కొండలరావు, నాయకులు కల్యాణం, బీంబాబు, నాగబ్బాయి, మత్స్యరాజు, రెడ్డిబాబు, ఈశ్వరరావు, రామారావు, సన్యాసినాయుడు, కృష్ణమూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 'రేషన్ లబ్ధిదారులకు ఈకేవైసీ తప్పనిసరి'



మాట్లాడుతున్న తహసీల్దార్ రవి కుమార్

చింతపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మం డలంలో రేషన్ కార్డు లబ్ధిదారులంతా విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని స్థాని క తహసీల్దార్ బి. రవికుమార్ అ న్నారు. బుధవారం తన కార్యాలయంలో వీఆ ర్వో, రెవెన్యూ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 65,410మంది రేషన్ లబ్ధిదారులు ఉండగా, 58,499 మంది ఈకేవైసీ చేయించుకున్నారన్నారు. ఇంకా, 7,011మంది ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈనెల 30తేదీలోగా లబ్ధిదారులు రేషన్ డీలర్ల వద్దకు వచ్చి ఈపోస్ మిషన్ ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. వీరికి మాత్రమే రేషన్ పంపిణీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ చంద్రశేఖర రావు, ఆర్ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## జూదం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: సీఐ



గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ వర ప్రసాద్

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు జూదం, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వర ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని తీముల బందలో పోలీసులు గ్రామసందర్శిని కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆదివాసీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గిరిజనులు గంజాయి సాగు, రవాణా జోలికి వెళ్లరాదన్నారు. గిరిజనుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎస్సై అప్పలసూరి, పోలీసులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో డీఐవో తనిఖీలు



ఈదులపాలెం పీహెచ్‌సీలో బాలింతతో మాట్లాడుతున్న డీఐవో డాక్టర్.కిరణ్‌కుమార్

పాడేరురూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదులపాలెం పీహెచ్‌సీని డీఐవోఎం.కిరణ్‌కుమార్ బుధవా రం ఆకస్మికంగా తనిఖీ చేశా రు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రి పరిధిలో గర్భిణుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోజు వారీ ఓపీ తదితర విషయాలను వైద్యులను అడిగితెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలోని కక్కి సబ్‌సెంటర్‌ను సందర్శించారు. ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. బాలింతలు, గర్భిణులకు పలు సూచనలు చేశారు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

## మంత్రి దృష్టికి గిరిజన సమస్యలు



నారా లోకేశ్ కలిసిన టీడీపీ నేత నాగేశ్వరరావు

డుంబ్రిగుడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అరకు నియోజకవర్గ పరిధిలోని గిరిజన ప్రాంత సమస్యలను మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లినట్టు టీడీపీ అరకు పార్లమెంట్ కోశాధికారి వంతల నాగేశ్వరరావు తెలిపారు. ఇటీవల విశాఖ వచ్చిన మం త్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. పరిశీల గెడ్డ వద్ద వంతెన, ఇసుక గరువులో బీటీ రోడ్డు, అమలగుడలో కాజ్‌వే మంజూరు చేయాలని కోరినట్టు నాగేశ్వరరావు ఈ సందర్భంగా తెలిపారు.

# వివిధ మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరురూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్‌లోని వివిధ మండలాల సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున ఈ నెల 4వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ పాడేరు విద్యుత్ శాఖ ఈఈ ఏవీఎస్ఎం అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతపల్లి ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో జీకేవీధి నుంచి లంకపాకలు వరకు, పాడేరు మండలం కిండంగి సబ్ స్టేషన్ వంట్లమామిడి ఫీడర్ మరమ్మతులతో వంట్లమామిడి, మినుములూరు, మలకపొలం, డల్లాపల్లి గ్రామాలకు, ముంచంగిపుట్టు మండలం మాకవరం ఫీడర్ పరిధిలో మాకవరం, కించాయిపుట్టు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అలాగే, చింతపల్లి సబ్ స్టేషన్ పరిధి అన్నవరం ఫీడర్‌లోని అన్నవరం, లోతుగెడ్డ, బలపం గ్రామాలకు, జి.మాడుగుల సబ్ స్టేషన్‌లోని కొక్కిరాపల్లి ఫీడర్‌లో కొక్కిరాపల్లి, పాలమామిడి, వంజరి, గెమ్మెలి గ్రామాలకు, కొయ్యూరు సబ్ స్టేషన్ పరిధిలోని ఆర్.కంఠవరం, నిమ్మలపాలెం, మంప గ్రామాలకు, అరకు మండలం హట్టగుడ ఫీడర్‌లో హట్టగుడ, మాదాల, చిన లబుడు, ఇరగాయి గ్రామాలకు, అనంతగిరి సబ్ స్టేషనల్ భీనుపురం ఫీడర్ మరమ్మతులు నేపథ్యంలో భీనుపురం, ఎగువశోభ, మర్లగుడ, బారజోల గ్రామాలకువిద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహం

- జిల్లా ప్రాజెక్టు మేనేజర్ భాస్కరరావు



విత్తనాలను ప్రదర్శిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పాడేరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 2025 వార్షిక ప్రణాళికను అనుసరించి జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని సంపూర్ణంగా ప్రోత్సాహించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎల్.భాస్కరరావు కోరారు. మండల స్థాయి వార్షిక ప్రణాళికలపై బుధవారం పాడేరులో వివిధశాఖలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 94 వేల ఎకరాల్లో గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారని, ఈ విస్తీర్ణ పెంపునకు వ్యవసాయానుబంధ శాఖలు స హకరించాలన్నారు. వివిధ రకాల విత్తనాలను ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయం, ఉద్యానవన, వెలుగు, మైక్రో ఇరిగేషన్, వాసన్ సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్‌లో హైబ్రీడ్ విత్తనాలు పంపిణీ: ఏడీఏ జాహ్నవి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ జాహ్నవి

చింతపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో సేంద్రియ సాగును ప్రోత్సహిస్తున్నట్టు స్థానిక వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కంటా జాహ్నవి అన్నారు. బుధవారం స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో చింతపల్లి, జీకేవీధి మండలాల వ్యవసాయ అధికారులు, ఉద్యోగులకు ఆమె సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అల్లూరి సీతారామ రాజును ఆర్గానిక్ హబ్‌గా ప్రకటించారన్నారు. ఈమేరకు కలెక్టర్ దినేశ్ కుమార్ ఆదివాసీ రైతులతో సేంద్రీయ సాగుపై దిశా నిర్దేశం చేశారన్నారు. ఖరీఫ్‌లో చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో 15వేల ఎకరాల్లో రైతులు పంటను సాగు చేస్తున్నారన్నారు. ఈఏడాది రైతులకు పచ్చిరొట్ట ఎరువు జనుము, పిల్లిపెసర, జీలుగ విత్తనాలు రైతులకు పంపిణీ చేస్తామన్నారు. అలాగే, హైబ్రీడ్ రకాలు ఎంటీయూ 1318, 1121, 1247, ఆర్ఎన్ఆర్ 15048, ఎన్ఎల్ఆర్ 34449 రకాలు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, జీకేవీధిల ఏవోలు బి. శ్రీనివాసరావు, మధుసూదనరావు పాల్గొన్నారు.

## రహదారులకు అనుమతిపై హర్షాతిరేకాలు



గుమ్మంతి-రెడ్డిపాడు రోడ్డుకు అటవీశాఖ అనుమతులు మంజూరుపై నమస్కరిస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్న గిరిజనులు

అనంతగిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినకోట పంచాయతీ గుమ్మంతి నుంచి రాచకీలం మీదుగా రెడ్డిపాడు, సమిధ నుంచి తట్టబూడి, చిందులపాడు..పెదబూరగ మీదుగా చింతపాక రహదారులకు బుధవారం కలెక్టర్ దినేశ్‌కుమార్ సమక్షంలోఅటవీశాఖ అనుమతులు మంజూరుచేయడంపై ఆయా గ్రామాల గిరిజనులు ఆనందం వ్యక్తంచేశారు. ఇందుకు చొరవ చూపిన కలెక్టర్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మేలు మరచిపోలేమని చేతులెత్తి తమ హర్షం వ్యక్తంచేశారు.

## ప్రకృతి వ్యవసాయమే లక్ష్యం

- జిల్లా వ్యవసాయ అధికారి సేవియర్ నందు



మహిళ రైతులకు విత్తనాలు ఇస్తున్నవ్యవసాయ అధికారి నందు, తదితరులు

పెదబయలు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులను వీడి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి సేవియర్‌నందు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య భవనంలో ఉద్యాన, పశుసంవర్థక, ఉపాధి హామీ, స్త్రీ శిశు సంక్షేమ, కాఫీ బోర్డు, మహిళ సమాఖ్య, సూక్ష్మ నీటి పారుదల శాఖలతో జరిగిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపిసీఎన్ఎఫ్)ను- 2028 నాటికి పాడేరు డివిజన్‌లోని గల రైతులు ఎటువంటి ఎరువులు, రసాయన కీటక నాశక మందులు వినియోగించకుండా శత శాతం ప్రకృతి వ్యవసాయం ద్వారానే పంటలు పండించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అనంతరం తొలకరి వర్షాలు కురిసే ముందు వేసే 32 రకాల విత్తన రకాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. రైతులకు ఆ విత్తనాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయం మేనేజర్ భాస్కరరావు, పీడీ రహీం, ఎంపీడీవో పూర్ణయ్య, తహసీల్దార్ రంగారావు, ఏవో శ్రీనివాస్, ఏపీవో పెదప్పల నాయుడు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తే జరిమానా



ముంచంగిపుట్టులో వ్యాపారులకు నోటీసులు అందజేస్తున్న ఎంపీడీవో సత్యనారాయణమూర్తి

చింతపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని పూర్తిగా నిషేధించినట్టు స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాస రావు తెలిపారు. బుధవారం చింతపల్లి వారపు సంతలో ప్లాస్టిక్‌కి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర సాధనలో భాగంగా వినియోగదారులు, వ్యాపారులు జూట్ బ్యాగ్‌లను వినియోగించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తే రూ. 500 నుంచి రూ.5 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత, ఇన్‌చార్జి ఈవోఆర్‌డీ శ్రీధర్, పంచాయతీ గుమస్త అంబేడ్కర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### పర్యావరణం పరిరక్షణకు సహకరించాలి: ఎంపీడీవో

ముంచంగిపుట్టు: పర్యావరణం పరిరక్షణకు అందరూ సహకరించాలని స్థానిక ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి అన్నారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ వి క్రయించరాదంటూ స్థానిక వ్యాపారులకు బుధవారం ఎంపీడీవో నోటీసులను అందించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వి క్రయిస్తే రూ. 3వేలు నుంచి రూ.5 వేలు వరకు జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీవో చిన్నాన్న, పంచాయతీ కార్యదర్శులు సింహాచలం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**గూడెంకొత్తవీధి:** తడి, పొడి చెత్తను వేరుచేసి పంచాయతీ సిబ్బందికి అప్పగించాలని దామనాపల్లి సర్పంచ్ కుందరి రామకృష్ణ గ్రామస్థులకు సూచించారు. బుధవారం కుటుంబాలకు తడి, పొడి చెత్త చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెసా కమిటీ ఉపాధ్యక్షుడు మాదిరి చంటిబాబు, గ్రామ పెద్దలు గెమ్మెలి మోహన్, చంటిబాబు, కార్యదర్శి శివ నాగలక్ష్మి పాల్గొన్నారు.

## మోదకొండమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ. 4.60 లక్షలు



హుండీ లెక్కిస్తున్న కమిటీ ప్రతినిధులు

పాడేరురూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టినట్టు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు తెలిపారు. గత నాలుగు నెలల హుండీ ఆదాయం రూ. 4 లక్షల 60 వేల 470తో పాటు రెండు అమ్మవారికి వెండి కళ్లు, రెండు ముక్క పుడకలు , ఒక బంగారం సంపతి, నాలుగు బంగారు ఆభరణాలు,మంగళ సూ త్రం, 10 వెండి కడియాలు, 6 రాగి కడియాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## కొండను ఢీకొన్న ఆటో: పలువురికి గాయాలు



ఎస్.కోట ఆస్పత్రికి క్షతగాత్రులను తరలిస్తున్న దృశ్యం..

అనంతగిరి, ఏప్రిల్ 2 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని డముకు-లైడ వద్ద బుధవారం ఆటో కొండను ఢీకొట్టిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. అరకులోయ మండలం పద్మాపురం పంచాయతీ దుమ్మగుడకు చెందిన సోమెల రోయల అనే మహిళ అనారోగ్యం బారినపడడంతో. కుటుంబ సభ్యులు ఆమెను ఎస్.కోట ఆస్పత్రికి ఆటోలోని తరలిస్తున్నారు.. లైడ మలుపువద్ద వచ్చేసరికి అదుపుతప్పి కొండను ఢీకొట్టింది.. ఈ ఘటనలో సోమెల రంగరావుతోపాటు రోయల, దోన మహిళలతో పాటు డ్రైవర్ గోవింద్ గాయపడ్డాడు.. అదే సమయంలోని అటువైపుగా వెళుతున్న ఎంపీపీ శెట్టి నీలవేణి.. క్షతగాత్రులను సేవలందించి, అనంతగిరి నుంచి వచ్చిన అంబులెన్స్ లో వారిని ఎస్.కోటకు తరలించారు.

### వాటర్ ట్యాంకర్ బోల్తా- ఇద్దరికి గాయాలు

కొయ్యూరు : మండలంలోని రొంపుల ఘాట్ రోడ్డు చిన కాటగ్రెడ్డ గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం వాటర్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో డ్రైవర్, క్లీనర్లకు గాయాలయ్యాయి. జాతీయ రహదారి 516 ఈ నిర్మాణ పనుల కు ట్యాంకర్‌లో నీటిని నింపుకుని వెళ్తుండగా ఘాట్‌లోని అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ కె. సత్తిబాబుకు తల, చేతులు, కాళ్లు తదితర చోట్ల గాయాలయ్యాయి. క్లీనర్ చంద్రరావు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను హుటాహుటీన కృష్ణాదేవిపేట పీహెచ్‌సీకు తరలించారు.

## అనకాపల్లి, కశింకోట, మునగపాక మండలాలకు
# తాగు నీటి సమస్య తలెత్తరాదు

- అధికారులకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశం
- సంపతిపురం మెగా వాటర్ ప్రాజెక్టు సందర్శన
- రూ.కోటితో అవసరమైన పనులు చేపట్టాలని మంజూరు


మెగా వాటర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం సంపతిపురం శివారున ఉన్న మెగా మంచినీటి ప్రాజెక్టును ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ బుధవారం సందర్శించారు. అనకాపల్లి, కశింకోట, మునగపాక మండలాల్లో ప్రజలకు శుద్ధి చేసిన తాగునీటిని అందించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ఈ ప్రాజెక్టును 2009లో ఏర్పాటు చేశారు. అయితే అప్పటి నుంచి గ్రామాలకు తాగునీరు అరకొరగానే అందుతుందని ఆయా గ్రామాలకు చెందిన పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన స్పందించారు. ఈ మేరకు అధికారులతో కలిసి నేరుగా ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం అక్కడి నుంచి ఏయే గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారన్న అంశాలను ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు డీఈ విజయలక్ష్మి, ఏఈ సుమలను అడిగి తెలుసుకున్నారు. అనకాపల్లి మండలంలో 81 గ్రామాలకు, కశింకోట మండలంలో 46 గ్రామాలకు, మునగపాకలో పలు గ్రామాలకు తాగునీరు అందుతుందని వారు వివరించారు. అయితే ఇటీవల ఈ ప్రాజెక్టు నుంచి అనకాపల్లి మండలంలోని 28 గ్రామాలకు తాగునీరు అందక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారానికి అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీరు సరఫరాకు అవసరమైన పనులు తక్షణమే చేపట్టాలని, అందుకు అవసరమైన రూ.కోటి నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. వేసవిలో నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులతో పాటు కూటమి నాయకులు చదరం నాగేశ్వరరావు, భరత్‌బాబు, గంగుపాం జగదీష్, సంపతిపురం ఎంపీటీసీ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ నవమి ఉత్సవానికి రాట


ఆలయం వద్ద పందిరి రాటలో ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి, తదితరులు

పరవాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమి ఉత్సవానికి సంబంధించి పరవాడ రామాలయం వద్ద బుధవారం పందిరి రాటను వేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఈ వేడుకను జరిపారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్ దంపతులు రాట వేశారు. ఈ నెల ఆరో తేదీ ఆదివారం శ్రీరామ నవమి రోజున ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారికి విశేష పూజలతో పాటు సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా జరుపుతామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, రెడ్డి శ్రీనివాసరావు, పైలా రామచంద్రరావు, పైలా అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 'రీ సర్వే'తో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



ఆరిపాకలో రీ సర్వేపై అధికాలు, ప్రజా ప్రతినిధుల ర్యాలీ

సబ్బవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరిపాకలో త్వరలో చేపట్టనున్న భూముల రీ సర్వేకు గ్రామస్థులంతా సహకరించాలని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ కోరారు. గ్రామంలో బుధవారం ఇందుకు సంబంధించి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రెండో విడత రీ సర్వేను ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహిస్తుందన్నారు. సర్వేకు వస్తున్న అధికారులకు రైతులు తమ భూ సరిహద్దులు, వారి వద్ద ఉన్న ఆధార పత్రాలు, భూ యజమానికి సంబంధించిన రెండు ఫొటోలు , ఫోన్ నెంబరుకు లింకై ఉన్న ఆధార్ కార్డు జెరాక్స్ విధిగా ఇవ్వాల్సిందిగా సూచించారు. అంతకు ముందు గ్రామస్థులు, ప్రజా ప్రతినిధులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఝాన్సీలక్ష్మీరాణి, గ్రామ పెద్దలు పాలిశెట్టి సురేష్‌రాజ్, శరగడం శంకరరావు, ఆడారి నాగరాజు, శరడం రాము, చినరాజు, వెంకట్, కాళ్ల శ్రీను, బీఎం నాయుడు, డీటీ గణపతిరావు, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, వీఆర్వో అప్పలరాజు, ఆడారి వెంకట్, కాళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యం : రత్నాకర్


సమావేశంలో మాట్లాడుతున్న దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. బుధవారం ఇక్కడి పెదరామ కల్యాణ మండపంలో 80వ వార్డు కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీకి కార్యకర్తలే ముఖ్యమని, వారి శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సభ్యత్వం పొందిన కార్యకర్తకు రూ.ఐదు లక్షలు ప్రమాద బీమా చేయించారన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ సాధికారత సారథులను ఏర్పాటు చేయనుందన్నారు. టీడీపీ నాయకుడు దాడి జయవీర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా పింఛన్ రూ.నాలుగు వేలు అందిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పార్టీ నాయకులు కొణతాల భాస్కరరావు, కొణతాల సత్యనారాయణ, కర్రి దివాకర్, కాండ్రేగుల రాజారావు, విల్లూరి అప్పలనాయుడు, మళ్ల రాజా, యర్రా సత్యనారాయణ, గొల్లవిల్లి రామకృష్ణ ప్రసాద్, బొడ్డేడ శంకర్రావు, కటారి శ్రీను పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వాడ చీపురుపల్లి పంచాయతీ పోలిరెడ్డిపాలెం సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా గురువారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఎస్. రామకృష్ణ తెలిపారు. ఈ కారణంగా వాడ చీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, దోసూరు, తిక్కవానిపాలెం పంచాయతీల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు.

# చిన్న ఊరు.. లారీల హోరు

- గుంకలలోవ రోడ్డులో క్వారీ వాహనాలు ఇష్టారాజ్యంగా రాకపోకలు
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అంతా హడల్
- కన్నెత్తి చూడని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు


గుంకలలోవ గ్రామం మీదుగా భారీ లోడ్లతో వెళుతున్న క్వారీ లారీలు

తుమ్మపాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం మార్టూరు పంచాయతీ గుంకలలోవ రహదారిపై ఇష్టారాజ్యంగా క్వారీ లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. మట్టి రోడ్డు కావడంతో క్వారీ లారీలు అధిక లోడ్లతో వెళుతుండడం వల్ల దుమ్ము ధూళి రేగుతోంది. ఈ కారణంగా గ్రామస్థులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

### సుమారు వంద కుటుంబాల వరకు నివాసం

మార్టూరు పంచాయతీ గుంకలలోవ 12వ వార్డులో సుమారు వంద కుటుంబాల వరకు నివాసం ఉంటున్నాయి. అంతా కూలీనాలీ చేసుకుంటూ బతుకీడ్చుతుంటారు. ఈ గ్రామానికి సమీపంలో దాదాపు 30వరకు క్వారీలు, పది వరకు క్రషర్లు ఉన్నాయి. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా క్వారీ, క్రషర్ల నిర్వహణ జరుగుతుండడంతో తామంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు గ్రామస్థులు చెపుతున్నారు.

### పెద్ద సంఖ్య లారీలు అధిక లోడ్లతో రాకపోకలు

నిత్యం వందలాది లారీలు అధిక లోడ్లతో గుంకలలోవ రోడ్డులో రాకపోకలు సాగిస్తుండడంతో విపరీతమైన దుమ్ము, ధూళి రేగి ఇళ్లలోకి చేరుతోంది. ఇళ్లు, పరిసరాలు మొత్తం బుగ్గితో నిండిపోయి నానా అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డును నిత్యం నీటితో తడపాలని వేడుకుంటున్నా క్వారీ, క్రషర్ల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని అంతా మండిపడుతున్నారు. ఈ సమస్యలను పలుమార్లు పంచాయతీ అధికారులు, మైన్స్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి ఫలితం లేకపోతోందని ఆరోపిస్తున్నారు.

### నాడు 20 మంది విద్యార్థులు.. నేడు నలుగురే..!

గుంకలలోవ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో సుమారు 20 మంది వరకు పిల్లలు విద్యనభ్యసించేవారు. లారీల రాకపోకలకు భయపడి తల్లిదండ్రులు తమ పిల్లలను దూర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో చేర్పించి చదివిస్తున్నారు. ప్రస్తుతం నలుగురు విద్యార్థులతోనే ఈ పాఠశాల కొనసాగుతుంది. అలాగే పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో 15 మంది వరకు చిన్నారులు ప్రతిరోజూ వచ్చి వెళ్లేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇద్దరు చిన్నారులు మాత్రమే ఈ కేంద్రంలో ఉంటున్నారు. దీనిపై స్థానికులు మాట్లాడుతూ గుంకలలోవ రహదారిలో లారీల బీభత్సానికి భయపడి పిల్లలు, చిన్నారులను పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించడం మానేశామన్నారు. ఒకవేళ పంపించినా దుమ్ము, ధూళి వల్ల వారంతా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారని భావించి పంపడం లేదన్నారు.

### బ్లాస్టింగ్‌లతో భయం..భయం..

ఇదిలావుంటే, క్వారీల్లో బ్లాస్టింగ్‌లు మరింత భయపెడుతున్నాయి. పేలుళ్ల సమయాల్లో భారీ శబ్దాలతో ఇళ్ల ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయని అంటున్నారు. కొందరు ఇళ్ల గోడలు సైతం పగులుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా ఇక్కడి పరిస్థితులపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిందిగా గ్రామస్థులంతా కోరుతున్నారు.

### లారీల దూకుడుతో ఇళ్ల వద్దే పిల్లలు



గుంకలలోవ రహదారిలో లారీల రాకపోకలకు భయపడి పిల్లలను పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించడం మానేశాం. లారీల డ్రైవర్లు ఇష్టానుసారంగా డ్రైవింగ్ చేస్తూ హడలెత్తిస్తున్నారు. అధిక వేగంతో రాకపోకలు సాగిస్తుండడంతో ఇళ్లు, ఒళ్లు మొత్తం బుగ్గితో నిండిపోయి రోగాల బారిన పడుతున్నాం. తరుచూ చిన్నారులు అస్వస్థతకు గురవుతున్నారు. సమస్యను అధికారులకు చెప్పినా ఇంత వరకు పట్టించుకోలేదు.

- గేదెల రమణ, గుంకలలోవ

### ఇష్టారాజ్యంగా యాజమాన్యాలు



మార్టూరులో గల క్వారీ, క్రషర్ల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల ప్రాణాలంటే కనీసం లెక్క లేకుండా తమ వ్యాపారాలు సాగిస్తున్నారు. కనీసం మట్టి రోడ్డును రోజుకు రెండుసార్లు అయినా తడపాలని మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదు. పలుమార్లు లారీల రాకపోకలు అడ్డుకొని ఆందోళన చేపట్టినా ప్రజా ప్రతినిధులతో బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తక్షణమే మా పరిస్థితిని పరిశీలించి సమస్యను పరిష్కరించాలి.

బి. శ్రీనివాసరావు, గుంకలలోవ


లారీలు వెళుతుండడంతో గ్రామంలో ఎగసి పడుతున్న దుమ్ము, ధూళి


మట్టి రోడ్డులో ఇష్టారాజ్యం వస్తున్న లారీలు

## పారిశుధ్య కార్మికులు ఆందోళన

- 'ఆప్కాస్'ను ప్రభుత్వం రద్దు చేస్తే.. పర్మినెంట్ చేయాలి
- ప్రైవేటు ఏజెన్సీలకు అధికారాలు ఇస్తే కొత్త సమస్యలు
- జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట నినాదాలు



జీవీఎంసీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఆఫ్ అవుట్ సోర్స్‌డ్ సర్వీసెస్ (ఆప్కాస్)ను ప్రభుత్వం రద్దు చేస్తే పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ వారంతా బుధవారం జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆప్కాస్‌ను తొలగించి ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వాలని చేస్తున్న ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని, కార్మికులకు పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు జారీ చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా రిటైర్‌మెంట్ చేయొద్దని, పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, గ్రాట్యుటీ చెల్లించాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఆప్కాస్ ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీన కార్మికుల అకౌంట్‌లకు జీతాలు వస్తున్నాయని, పీఎఫ్, ఈఎస్ఐ నిధులు ఆయా ఖాతాల్లో ఏ విధమైన కోతలు లేకుండా జమవుతున్నాయని వివరించారు. అదే ప్రైవేటు ఏజెన్సీలు రంగంలోకి వస్తే ఇష్టారాజ్యంగా మారి కార్మికులు పస్తులతో బతకాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అధికారాలు ఇచ్చే చర్యలను విడనాడాలని కోరారు. ఈ ఆందోళనలో యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్, ప్రతినిధులు యర్రంశెట్టి శివ, అజయ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై క్వారీ కార్మికులు వంటా- వార్పు

తుమ్మపాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ క్వారీ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా రెండో రోజైన బుధవారం బవులవాడ గ్రామంలో వంటా- వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నవయువ సమాఖ్య రాష్ట్ర కమిటీ సభ్యుడు నందారపు భాస్కరరావు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. కొండలను, బండలను కరిగించి యజమానులకు కోట్లాది రూపాయలను సమకూర్చుతున్న కార్మికుల దుస్థితి రోజు రోజుకు ఛిన్నాభిన్నంగా మారుతోందన్నారు. అయినప్పటికీ యాజమాన్యాలు వీరి సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు కోన మోహనరావు, సేనాపతి అప్పలనాయుడు, చింతల రమేష్, ఎ.అప్పలనాయుడు, సీహెచ్.చిన్నారావు, చవితిన నూకరాజు, జి.తాతబాబు తదితరులు పాల్గొన్నారు.


వంటా- వార్పు ద్వారా నిరసన తెలుపుతున్న కార్మికులు

## 'పాలీసెట్' విద్యార్థులకు ఉచిత శిక్షణ ప్రారంభం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పౌర్ణమి సేవా సంస్థ పాలీసెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు ఉచితంగా ఏర్పాటు చేస్తున్న శిక్షణ తరగతులను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని భారత వికాస్ పరిషత్ ప్రతినిధులు ఎస్.గోపాలరావు, పి.నిర్మల కోరారు. ఇక్కడి కళ్యాణి నర్సింగ్ హోం మేడపైన శిక్షణ తరగతులను సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావుతో కలిసి బుధవారం ప్రారంభించి మాట్లాడారు. పాలీసెట్‌కు హాజరు కానున్న విద్యార్థులు ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. రిటైర్డు ఎంఈవో ఎస్ఎస్‌సీ బోస్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యతో మెరుగైన ఉపాధి, ఉద్యోగావకాశాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పెతకంశెట్టి ఆదికోటి, ఏఎస్ నాయుడు, బొడ్డేడ కాశీ, కర్రి సుబ్రహ్మణ్యం, ఆళ్ల మాధవ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఆధార్ నమోదు కేంద్రాలు

సబ్బవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం నుంచి ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. తొలిరోజు అసకపల్లి, గుల్లేపల్లి, నాలుగో తేదీన ఆరిపాక, బంగారమ్మపాలెం, గుల్లేపల్లి, మలునాయుడుపాలెం, ఎనిమిదిన నారపాడు, నారపాడు-2, గుల్లేపల్లి, మొగలిపురం, తొమ్మిదిన అసకపల్లి, పైడివాడ అగ్రహారం, గుల్లేపల్లి, బోదివలస, పదిన సబ్బవరం-1, అమృతపురం, పదకొండో తేదీన గొటివాడ, అంతకాపల్లి గ్రామాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆధార్ కార్డుల్లో ఎటువంటి తప్పులు ఉన్నా కేంద్రాల్లో సరిచేసుకోవచ్చునని వివరించారు.

## ఆటిజంపై అవగాహన సదస్సులు


కొప్పాకలో మాట్లాడుతున్న ప్రత్యేక ఉపాధ్యాయులు వరప్రసాద్

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పాకలోగల భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల తల్లిదండ్రులు, ఆటిజం సమస్యతో బాధపడుతున్న పిల్లల తల్లిదండ్రుల సమక్షంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మండల ప్రత్యేక ఉపాధ్యాయులు బీవీ వరప్రసాద్ మాట్లాడుతూ ఆటిజం ఏర్పడడానికి ప్రధాన కారణాలను వివరించారు. జన్యుపరమైన లక్షణాలు, గర్భధారణ సమయంలో తల్లికి ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, పర్యావరణ ప్రభావం వంటి అంశాలు ఆటిజం సమస్యను ప్రభావితం చేసే కారణాలుగా పరిశోధనలు చూపుతున్నాయన్నారు.

కశింకోట : మండల కేంద్రమైన కశింకోట భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు హాజరై ఆటిజం అంటే ఏమిటో క్లుప్తంగా వివరించారు. ఆటిజం అంటే న్యూరోలాజికల్ డెవలప్‌మెంట్ డిజార్డర్ అని, ఇది మెదడు అభివృద్ధి లోపాలను ఆటిజం రావడానికి జెన్యుపరమైనవి కొన్ని ఉన్నప్పటికీ ఖచ్చితమైన కారణాలు ఇంతవరకు ఎవరూ కనుగొనలేదని తెలిపారు. ఆటిజం వ్యాధి కాదని పేర్కొన్నారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ స్కూల్ నంబర్-2 హెచ్‌ఎం సీహెచ్.రామునాయుడు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు బీవీ రమణమ్మ, ఎస్.దీపా,దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కశింకోట పురవీధుల్లో ర్యాలీ చేస్తున్న దివ్యాంగ విద్యార్థులు, టీచర్లు


పరవాడలో కేంద్రంలో ఎంఈవో సాయి శైలజ, తదితరులు

పరవాడ : అవగాహనతోనే ఆటిజంను దూరం చేయవచ్చునని ఎంఈవో జి.సాయిశైలజ అన్నారు. ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా ఇక్కడి భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. చిన్నారుల ప్రవర్తనలో వచ్చే మార్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అటువంటి వాటిని గుర్తిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించాల్సిందిగా సూచించారు. అనంతరం భవిత కేంద్రంలో దివ్యాంగులకు అనకాపల్లి ఆర్టీసీ డిపో అధికారులు బస్‌పాసులను జారీ చేశారు. సదరన్ ధ్రువపత్రాలను పరిశీలించి 25 మంది దివ్యాంగులకు ఈ పాస్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో అధికారులు సీహెచ్.ధనలక్ష్మి, వైవీఎస్ కుమార్, భవిత కేంద్రం టీచర్లు కుమారి, శ్రీనివాస్, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల దీక్షలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం 33వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ తప్పుడు కేసులు రాసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, అక్రమంగా సస్పెన్షన్ చేసిన డ్రైవర్, కండక్టర్‌లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని నినాదాలిచ్చారు. ఈ దీక్షలో జేఎస్ రావు, పీఏ నాయుడు, కెఎస్ రావు తదితరులు కూర్చున్నారు

# డిప్యూటీ మేయర్లపైనా అవిశ్వాసం

- జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్,
- జిల్లా కలెక్టర్‌కు నోటీసులు అందజేసిన కూటమి కార్పొరేటర్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కూటమి కార్పొరేటర్లు బుధవారం ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్‌కు నోటీస్ అందజేశారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాసం ప్రకటిస్తూ కూటమి కార్పొరేటర్లు ఇప్పటికే నోటీస్ ఇచ్చారు. ఈ మేరకు ఈనెల 19న మేయర్ కౌన్సిల్ సమావేశం నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తాజాగా డిప్యూటీ మేయర్లు ఇద్దరిపై అవిశ్వాస తీర్మానానికి నోటీస్ ఇవ్వడంతో 19న జరిగే కౌన్సిల్ సమావేశంలోనే ఈ అంశం కూడా తేలిపోయే అవకాశం ఉందంటున్నారు. నోటీస్ అందజేసిన అనంతరం కలెక్టరేట్ ఆవరణలో జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిరిగానే జీవీఎంసీలో కూడా కూటమి పాలన ఉండాలని నగరవాసులు కోరుకుంటున్నారన్నారు. అందుకోసమే మేయర్‌తోపాటు డిప్యూటీ మేయర్లపైనా అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చామన్నారు.

జీవీఎంసీలో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ గత నాలుగేళ్లలో మేయర్, డిప్యూటీ మేయర్‌లు, వైసీపీ ఫ్లోర్‌లీడర్ పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారని, అందుకే అవిశ్వాస తీర్మానం పెట్టాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావుతోపాటు టీడీపీ, జనసేన కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు రేపు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌లో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల నాల్గో తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని జడ్పీ బీవీ రమణ తెలిపారు. ఆ రోజు ఉదయం పది గంటలకు స్థానిక గుండాల జంక్షన్‌లోని ఎస్ఆర్ శంకరన్ భవనంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ తెల్లరేషన్ కార్డు/ రేషన్‌కార్డు జెరాక్స్, ఆధార్ కార్డు జెరాక్స్ బ్యాంక్ పాస్‌బుక్ జెరాక్స్ కుల ధ్రువీకరణ పత్రం తీసుకొని హాజరు కావాల్సిందిగా కోరారు.

## 20 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నూతనగుంటపాలెంలో మద్యం విక్రయిస్తున్న షాపుపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ సందర్భగా ఇరవై క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కొఠారి రాధ అనే మహిళపై కేసు నమోదు చేశామని స్టేషన్ రైటర్ సూర్యారావు తెలిపారు.

# ఆదర్శం.. పోతిరెడ్డిపాలెం


అభివృద్ధి చేసిన చెరువు, మధ్యలో శివపార్వతుల విగ్రహాలు

## సర్పంచ్ సంకల్పానికి అండగా నిలిచిన గ్రామస్థులు

- అమ్మవార్ల ఆలయాలు జీర్ణోద్ధరణ
- బహుళ ప్రయోజనాలతో చెరువు అభివృద్ధి
- గట్టు చుట్టూ మొక్కలతో పచ్చదనం
- వాకింగ్ ట్రాక్, పిల్లలకు ఆట వస్తువులతో పార్కు
- చెరువు మధ్యలో శివపార్వతుల విగ్రహాలు
- రూ.85 లక్షలు విరాళాలుగా ఇచ్చిన ప్రజలు
- మిగిలిన రూ.15 లక్షలు పంచాయతీ నిధులు


పునర్నిర్మించిన తాళ్లమ్మతల్లి, నూకాంబిక అమ్మవారి ఆలయాలు

ఎలమంచిలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి):

**ఊరు అభివృద్ధి విషయంలో సర్పంచ్ సంకల్పానికి గ్రామస్థులు అండగా నిలిచారు. పురాతన ఆలయం స్థానంలో కొత్త ఆలయాన్ని నిర్మించుకున్నారు. చెరువును, గట్టును అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దారు. గట్టుపై ఒక వైపు పిల్లల కోసం ఆటల పరికరాలతో పార్కును నిర్మించారు. సర్పంచ్ పిలుపుతో ఈ పనులకు అవసరమైన నిధులను గ్రామస్థులు విరాళాల రూపంలో అందించారు.**

ఎలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెంలో సుమారు పన్నెండు వందల మంది జనాభా నివసిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుతో పోటీచేసిన ఇత్తంశెట్టి సన్యాసినాయుడు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అప్పట్లో అధికారంలో వున్న వైసీపీ ప్రభుత్వం.. గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకపోగా.. కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను సైతం తన ఖాతాకు


చెరువు గట్టుపై పిల్లల కోసం ఆటల పరికరాలతో ఏర్పాటు చేసిన పార్కు


చెరువుగట్టుపై వాకింగ్ ట్రాక్, కూర్చోడానికి సిమెంట్ బెంచీలు

మళ్లించుకుంది. పోతిరెడ్డిపాలెం పంచాయతీకి కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ అభివృద్ధి పనుల విషయంలో సర్పంచ్ సన్యాసినాయుడు వెనకడుగు వేయలేదు. పురాతనమైన గ్రామ దేవత తాళ్లమ్మతల్లి ఆలయంతోపాటు నూకాంబిక ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేయాలని, ఆలయాలకు ఎదురుగా వున్న చెరువును అభివృద్ధి చేయాలని భావించారు. పంచాయతీలో నిధులు తక్కువగా వుండడంతో ప్రజల సహకారం కోరారు. నిస్వార్థంగా సేవ చేసే వ్యక్తి కావడంతో సర్పంచ్‌పై నమ్మకంతో విరాళాలు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఆర్థిక స్థోమతనుబట్టి ఎవరికి వారు తోచినంత చందా ఇచ్చారు. దీంతో సుమారు రూ.85 లక్షలు విరాళాలుగా వచ్చాయి. పంచాయతీ నిధులు మరో రూ.15 లక్షలు కలిపి 2023లో పనులు మొదలుపెట్టారు. తాళ్లమ్మతల్లి, నూకాంబిక అమ్మవారి ఆలయాలను పునర్నిర్మించారు. ఆలయాల ముందున్న చెరువులో పూడిక తీయించి, చుట్టూ మొక్కలు నాటించారు. ఆలయాల ముందు నుంచి చెరువులోకి జెట్టీ తరహాలో సిమెంట్ ర్యాంపు నిర్మించి, శివపార్వతుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. చెరువులో బోటు షికారు కోసం ఫైబర్ బోటును అందుబాటులోకి తెచ్చారు. చెరువు గట్టును వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేశారు. కూర్చోడానికి సిమెంట్ బెంచీలు సమకూర్చారు. గట్టుచివరన ఒకవైపు పిల్లలు ఆడుకునేందుకు పలు రకాల పరికరాలను ఏర్పాటు చేశారు. మొత్తం పనులన్నీ ఏడాదిలో పూర్తయ్యాయి. పెద్దలు, పిల్లలు రోజూ ఉదయం, సాయంత్రం ఇక్కడకు వచ్చి ఆహ్లాదంగా గడుపుతున్నారు.

### జీవిత లక్ష్యం నెరవేరింది



నేను సర్పంచ్‌గా పనిచేయడం ఇది రెండోసారి. నన్ను గెలిపించిన ప్రజలకు శక్తిమేరకు మంచి చేయాలన్నది నా ఉద్దేశం. ప్రజల సహకారంతో నా ఆలోచనలు కార్యరూపం దాల్చాయి. ఆలయాల పునర్ని ర్మాణం, చెరువును అందంగా తీర్చిదిద్దడానికి గ్రామస్థులు ఉదారంగా విరాళాలు ఇచ్చారు. నా హయాంలో చిరకాలం నిలిచిపోయే అభివృద్ధి పనులు చేయడం ఎంతో ఆనందంగా వుంది. నా జీవిత లక్ష్యం నెరవేరింది.

**ఇత్తంశెట్టి సన్యాసినాయుడు,** పోతిరెడ్డిపాలెం సర్పంచ్

## ఫార్మాలో ఉద్యోగాలకు 5న ఇంటర్వ్యూలు

అచ్యుతాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఫార్మా కర్మాగారాల్లో ఉద్యోగాల కోసం ఈనెల 5న తమ కళాశాల ఆవరణలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రశాంతి పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. లైఫ్ సైన్సెస్ సెక్టర్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగే ఈ ఇంటర్వ్యూలకు డిప్లొమా మెకానికల్, ఎంక్ట్రానిక్స్ 2004లో పాసైన అభ్యర్థులు, బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ లైఫ్ సైన్సెస్ చదివి 2004లో పాసైన విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులకు విజయవాడలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి నియామకాలు చేస్తారన్నారు. మరిన్ని వివరాలకు 97012 41753 ఫోన్ నంబర్‌ను సంప్రతించాలన్నారు.

## అధిక బరువు లారీలకు అపరాధ రుసుము

మునగపాక, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించకుండా అధిక బరువు బండ రాళ్లతో అచ్యుతాపురం వైపు వెళుతున్న మూడు లారీలను గుర్తించామని స్థానిక ఎస్ఐ పి.ప్రసాదరావు బుధవారం తెలిపారు. వాటి వివరాలను ఆర్టీవో దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ఒక్కో లారీకి ఆర్టీవో రూ.32 వేలు చొప్పున అపరాధ రుసుము విధించారని చెప్పారు.

## చినదొడ్డిగల్లు సూక్ష్మ కళాకారుడికి అరుదైన గౌరవం

- యూఎస్‌కు చెందిన 'మేక్' మ్యాగజైన్‌లో కథనం


మ్యాగజైన్‌లో ప్రచురితమైన తన కథనాన్ని చూపిస్తున్న వెంకటేశ్



సూక్ష్మ కళాకారుడు గట్టెం వెంకటేశ్ ప్రతిభ గురించి యూఎస్ మ్యాగజైన్‌లో ప్రచురితమైన కథనం

నక్కపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పెన్సిల్ ముల్లులపై ఎన్నో కళాఖండాలను తయారు చేస్తూ, సూక్ష్మ కళలో ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్న చినదొడ్డిగల్లు సూక్ష్మ కళాకారుడు గట్టెం వెంకటేశ్‌కు మరో అరుదైన గౌరవం దక్కింది. దశాబ్దం కాలం నుంచి పెన్సిల్ ముల్లులపై ఎన్నో కళారూపాలను తయారు చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో వెంకటేశ్ చోటు సంపాదించుకున్నారు. రాష్ట్రపతి అవార్డును కూడా పొందారు. తాజాగా యూఎస్‌లో ప్రఖ్యాతి చెందిన మేక్ మ్యాగ్జైన్‌లో వెంకటేశ్ సూక్ష్మ కళా నైపుణ్యంపై కథనం ప్రచురితమైంది. ఏప్రిల్ నెల సంచికలో వెంకటేశ్ గురించి ప్రత్యేక కథనాన్ని ప్రచురించారు. గత కొన్నాళ్ల నుంచి ఉద్యోగరీత్యా వెంకటేశ్ యూఎస్‌లోనే వుంటున్నారు. సూక్ష్మ కళపై మేక్ మ్యాగ్జైన్‌లో స్టోరీ రావడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

## కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో సభ్యుల నిరసన


కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో సభ్యులు

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. 12వ పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించాలని, డీఏ బకాయిలను, సరెండర్ లీవ్ బకాయిలను, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ తక్షణమే చెల్లించాలని ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ యేశపోగు సుధాకర్‌రావు డిమాండ్ చేశారు. అనంతరం ఫ్యాప్టో కార్యవర్గసభ్యులు కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో సభ్యులు వత్సవాయి శ్రీలక్ష్మి, పరదేశి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## రెవెన్యూ సేవలు మరింత వేగవంతం చేయాలి

- అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు
- కలెక్టర్ విజయకృష్ణన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, హాజరైన అధికారులు

అనకాపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ కార్యాలయాలకు అందు తున్న భూ సమస్యల పరిష్కారంలో ఎటువంటి జాప్యం చేయకుండా సేవలను వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జేసీ జాహ్నవితో కలిసి రెవెన్యూ శాఖలో రీసర్వే, మ్యుటేషన్లు, ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ, నీటి తీరువా వసూళ్లు, తదితర అంశాలపై మండల రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయాలకు అందుతున్న దరఖాస్తులను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలన్నారు. రీసర్వే పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. కొన్ని మండలాల్లో ఆటో మ్యూటేషన్‌లు పెరిగాయని, కొన్నిచోట్ల తగ్గాయని, దీనికి కారణాలపై తహసీల్దార్లు సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓలు అర్జీల పరిష్కారాలపై ఎప్పటికప్పుడు తహసీల్దార్లతో సమీక్ష జరపాలని ఆదేశించారు. పేదలకు కొత్తగా ఇళ్ల మంజూరు కోసం మండలాల్లో స్థలాలను గుర్తించి సిద్ధంగా ఉండాలన్నారు. రీసర్వే సందర్భంలో హద్దుల నిర్ణయం, ఇతరత్రా వివరాల నమోదు భూ యజమానుల సమక్షంలోనే చేయాలన్నారు. జిల్లాలో పేరుకుపోయిన రూ.17 కోట్ల పైచిలుకు నీటితీరువా బకాయిలను వసూలు చేయాలని ఆదేశించారు. జేసీ జాహ్నవి మాట్లాడుతూ రెండో విడత రీసర్వే చేపడుతున్న గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలన్నారు. ముందుగా భూ యజమానులకు నోటీసులు జారీ చేసి సర్వే నిర్వహించాలని సూచించారు. రీసర్వేకు అవసరమైన అదనపు సిబ్బందిని నియమించుకోవాలని తెలిపారు. పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలకు మండల రెవెన్యూ అధికారులు స్పందించి నివేదికలు అందజేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో సత్యనారాయణరావు, సర్వే, రికార్డుల విభాగం ఏడీ గోపాలకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలు, కలెక్టరేట్‌లో వివిధ విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## నక్కపల్లి సంతలో అగ్నిప్రమాదం

- 50 దుకాణాలు దగ్ధం
- సంత రోజు కాకపోవడంతో తప్పిన ప్రమాదం
- ఘటనపై హోం మంత్రి అనిత ఆరా


మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది


వారపు సంతలో దగ్ధమవుతున్న పాకలు

నక్కపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వారపు సంతలో బుధవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. వారపుసంతలో ఎవరూ లేని సమయంలో ఆకస్మికంగా మంటలు చెలరేగి కొన్ని పాకలకు అంటుకున్నాయి. ఆ వెంటనే మంటలు ఎగసిపడ్డాయి. అగ్నికీలలకు సుమారు 50 దుకాణాలు కాలిబూడిదయ్యాయి. సంత రోజు కాకపోవడంతో వ్యాపారులు, కొనుగోలుదారులెవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పినట్టు భావిస్తున్నారు. వారపు సంతను ఆనుకునే ఫైర్ స్టేషన్ వుంది. ఈ సమయంలో అగ్నిమాపక సిబ్బంది వేరే గ్రామానికి శకటంతో వెళ్లారు. దీంతో ఎలమంచిలి, హెటెరో ఔషధ పరిశ్రమ నుంచి అగ్నిమాపక వాహనాలతో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. కానీ అప్పటికే 50 పాకలు కాలిపోయాయి. సుమారు రూ.25 లక్షల నష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నర్సింహమూర్తి, సీఐ కుమారస్వామి, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్, టీడీపీ నేతలు కొప్పిశెట్టి వెంకటేశ్, కొండబాబు, కొప్పిశెట్టి బుజ్జి ప్రమాదస్థలికి చేరుకున్నారు. సమాచారాన్ని హోం మంత్రి అనితకు తెలియజేశారు. తక్షణ సాయం అందించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కాగా వారపుసంతలో చిరు వ్యాపారులకు పక్కా షెడ్లు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు.

## బార్క్ నిర్వాసితులతో ఆర్డీవో చర్చలు

- డీ పట్టా, అనాధీన భూములకు రూ.20 లక్షలిస్తామన్న ఆర్డీవో
- జిరాయితీతో సమానంగా పరిహారం ఇవ్వాలన్న తంతడి నిర్వాసితులు
- రూ.60 లక్షలు ఇవ్వాలన్న రావిపాలెం గ్రామస్థులు
- పరిహారం పెంచాలన్న దొప్పెర్ల వాసులు


సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాసితుల ప్రతినిధి

అచ్యుతాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) నిర్వాసిత గ్రామాలైన తంతడి, రావిపాలెం, దొప్పెర్ల నిర్వాసితులతో ఆర్డీవో షేక్ ఆయిషా బుధవారం సమావేశమై చర్చలు జరిపారు. ఈ గ్రామాల్లో భూములను బార్క్ కోసం ఏపీఐఐసీ గతంలో సేకరించి జిరాయితీ భూములకు పరిహారం చెల్లించేశారు. అయితే డీపట్టా, అనాధీనం భూములకు కూడా పరిహారం ఇవ్వాలంటూ నిర్వాసితులు చాలా కాలంగా ఆందోళన చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో దీని గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పనులు ప్రారంభించడానికి ప్రయత్నిస్తుండగా, నిర్వాసితులు అడ్డుకుంటూ వచ్చారు. ఈ మేరకు బుధవారం ఆర్డీవో.. నిర్వాసితులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. డీపట్టా, అనాధీనం భూములకు రూ.20 లక్షలు ఇస్తామని ఆర్డీవో ఆయిషా ప్రకటించారు. దీనికి కొందరు నిర్వాసితులు అంగీకరించగా, మరి కొందరు ధర పెంచాలని కోరారు. నక్కపల్లిలో భూ నిర్వాసితులకు ఇచ్చే విధంగా డి పట్టాదారులకు రూ.60 లక్షలు ఇవ్వాలని రావిపాలెం నిర్వాసితులు కోరారు. అలాగే నూతులు, బోర్లుకు కూడా పరిహారం ఇవ్వాలని, పశువుల పాకలున్న వారికి ఐదు సెంట్లు భూమి ఇవ్వాలని, గ్రామం ఉమ్మడి అవసరాలకు ఆలయాలు, రుద్రభూమి వంటి వాటికి పది కరాలు కేటాయించాలని కోరారు. రావిపాలెం నుంచి తమ్మయ్యపేట మీదుగా మేకరాశి కొండ వద్ద ఉన్న బార్క్ కాలనీకి ఉన్న రోడ్డును అభివృద్ధి చేసుకోవాలే తప్ప వెడల్పుకోసం మళ్లీ భూసేకరణ చేయకూడదని కోరారు. జిరాయితీతో సమానంగా డీపట్టా, అనాధీన భూములకు పరిహారం ఇవ్వాలని తంతడి నిర్వాసితులు కోరగా, డీపట్టాకి మాత్రం జిరాయితీతో సమానంగా పరిహారం ఇవ్వడానికి ఆర్డీవో అంగీకరించారు. దొప్పెర్ల నిర్వాసితులకు రూ.20 లక్షలు ఇస్తామని ఆమె చెప్పారు. గ్రామాలకు వెళ్లే రహదారులు మూయకుండా ఉండాలని నిర్వాసితులు కోరారు. మీ అభిప్రాయాలపై నివేదికను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్డీవో హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వరహాలు, డీటీ శ్యామ్‌కుమార్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్‌తో పాటు నిర్వాసిత రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## క్రైం... crime news

### చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధురాలి మృతి


గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో జరిగిన రైలు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతున్న ఓ గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందినట్టు జీఆర్‌పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి బుధవారం తెలిపారు. గత నెల 27వ తేదీన రెండు, మూడు ప్లాట్‌ఫారాల పైనుంచి జారి పడడం వల్ల బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించామన్నారు. ఎత్తు ఐదు అడుగులు, తెలుపు, నలుపు జుత్తు కలిగి ఉందని తెలిపారు. పింక్ కలర్ చీర, బ్లూ కలర్ జాకెట్ ధరించి ఉందన్నారు. సంఘటన జరిగిన ప్రదేశంలో గాలించినా ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. ఆమె వివరాలు తెలిసిన వారు 73820 58996 సెల్ నంబర్‌ను సంప్రతించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

### యువకుడి అదృశ్యం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శారదానగర్‌కు చెందిన ఓ యువకుడు అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందినట్టు పట్టణ ఎస్ఐ కె.సంతోశ్‌కుమార్ తెలిపారు. వంగి నరేంద్ర ఇంటర్ ఫెయిల్ అయి ఇంటివద్దే ఖాళీగా ఉంటున్నాడన్నారు. గత నెల 29వ తేదీ రాత్రి సుమారు ఎనిమిది గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. తల్లి ప్రభ కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

### ప్రాణాలు తీసిన మితిమీరిన మద్యపానం

నర్సీపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని జోగినాథునిపాలెం రోడ్డులో కాలువ పక్కన ఓ వ్యక్తి చనిపోయాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి మాకవరపాలెం మండలం వజ్రగడ గ్రామానికి చెందిన తమరాన రాజుబాబు (50)గా గుర్తించారు. ఇతనికి అతిగా మద్యం సేవించే అలవాటు వుందని, సహజ మరణంగా భావిస్తున్నామని కుటుంబ సభ్యులు చెప్పారని పట్టణ సీఐ గోవిందరావు తెలిపారు. రాజుబాబు మృతిపై వారు ఎటువంటి అనుమానాలు వ్యక్తం చేయకపోవడంతో పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని ఆయన చెప్పారు. తెలిపారు.

## వాట్సాప్‌లోనే ఇంటర్ ఫలితాలు

- పీడీఎఫ్ రూపంలో డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు మరికొద్ది రోజుల్లో విడుదల కానున్నాయి. డిజిటల్ పరివర్తనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ పరీక్షల ఫలితాలను నేరుగా వాట్సాప్‌లోనే విడుదల చేయనుంది. అందుకు ఇంటర్ బోర్డు సన్నాహాలు చేస్తోంది. గత నెల ఏడో తేదీన ప్రారంభించిన జవాబు పత్రాల మూల్యాంకనం ఈనెల ఆరో తేదీ నాటికి పూర్తి కావాల్సివుంది. అయితే సబ్జెక్టు అధ్యాపకుల కొరతతో రెండు మూడు రోజులు ఆలస్యమవుతుందని భావిస్తున్నారు. ఈ ఏడాది మార్కుల జాబితాను పీడీఎఫ్ రూపంలో విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో మార్కులను స్కాన్ చేసి పీడీఎఫ్ ఫార్మాట్‌లోకి మార్చాల్సివుంది. ఇవన్నీ జరగడానికి మరో ఐదారు రోజుల సమయం పడుతుందని, దీంతో 12-15 తేదీల మధ్య ఫలితాలు విడుదల చేసే అవకాశం ఉందని ఇంటర్ బోర్డు జిల్లా అధికారులు వెల్లడించారు. ఇంటర్ ఫలితాలు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా తెలుసుకోవాలంటే 95523 00009 నంబరుకు హాయ్ అని మెసేజ్ చేయాలి. వచ్చిన ఆప్షన్స్‌లో ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఎంపిక చేసుకుంటే ఇంటర్ ఫలితాలు 2025 అని వస్తుంది. ఆ ఆప్షన్‌పై క్లిక్ చేసి, హాల్ టికెట్ నంబరు ఎంటర్ చేస్తే పీడీఎఫ్ ఫార్మాట్‌లో విద్యార్థి రిజల్ట్ కనిపిస్తుంది. దానిని డౌన్‌లోడ్ చేసుకుని షార్ట్ మెమో కింద వినియోగించుకోవచ్చు.

## వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

... 5వ పేజీ తరువాయి

దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దామెదర్‌నాయుడు తెలిపారు.

**ఎలమంచిలిలో...**

మండలంలోని బయ్యవరం పంచాయతీశివారు ఎర్రమెరకలో యల్లపు చిన్న అప్పారావు(56) తన ఇంట్లో ఫ్రిడ్జ్ ప్లగ్ తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఇదే మండలం రేగుపాలెం జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో రాంబిల్లి మండలం వాడనరసాపురం గ్రామానికి చెందిన ఎరిపిల్లి దానయ్య(49) మృతిచెందాడు. అడ్డరోడ్డు వైపు నుంచి ఎలమంచిలి వైపు వస్తున్న ఇతనిని అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొన్నది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

**చెట్టు పైనుంచి పడి కల్లుగీత కార్మికుడి మృతి**

చోడవరం మండలం నర్సయ్యపేటకు చెందిన కల్లు గీత కార్మికుడు మేడిశెట్టి నూకరాజు(60) బుధవారం సాయంత్రం గ్రామ శివారులోని తోపులో కల్లు తీయడానికి తాడి చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో అదుపు తప్పి చెట్టు మీద నుంచి కింద పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నూకరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. కొంతసేపటి తరువాత అటుగా వెళుతున్న రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

## శక్తి బృందాలు

... 5వ పేజీ తరువాయి

డయల్ 112, 100 నంబర్లకు వచ్చే కాల్స్‌కు స్పందించి శక్తి బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని ఆకతాయిల నుంచి బాధితులను కాపాడాలని ఎస్పీ ఆదేశించారు. శక్తి యాప్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. శక్తి బృందాల పనితీరును అదనపు ఎస్పీ దేవప్రసాద్ పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ సమావేశానికి మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ ఇ.శ్రీనివాసులు, సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మనోజ్‌కుమార్, శక్తి బృందాల సభ్యులు హాజరయ్యారు.

## ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

... 5వ పేజీ తరువాయి

సబ్ డివిజన్‌లోని ఎలమంచిలి మండలంలో తెరువుపల్లి, ఎస్.రాయవరంలో పెట్టుగోళ్లపల్లి, రాంబిల్లిలో మూలజంప, అచ్యుతాపురంలో జగ్గన్నపేట, పాయకరావుపేట సబ్‌డివిజన్‌లోని పాయకరావుపేట మండలంలో ఆర్.కొత్తూరు, నాతవరంలో ఎస్‌బీ పట్నం, మాకవరపాలెంలో ఎన్‌ఆర్‌పేట, కోటవురట్లలో గవరపేట, నక్కపల్లిలో జానకిపేట గ్రామాలను ఎంపిక చేశారు. నర్సీపట్నం సబ్‌డివిజన్‌లోని నర్సీపట్నం మండలంలో కశిరెడ్డిపాలెం, గొలుగొండలో దిబ్బలపాలెం, రోలుగుంటలో ఆర్ల, వి.మాడుగులలో ఎల్.కొత్తపల్లి, రావికమతంలో జడ్.కొత్తపట్నం గ్రామాలు ఎంపికయ్యాయి. ఈ గ్రామాల్లో ఏ రైతుకు ఎంత పొలం వుంది, ఏ పంటలు సాగు చేస్తున్నారు వంటి వివరాలను సేకరించారు. ఈ గ్రామాల్లో పంటల సాగులో ఒక్క రైతు కూడా రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగించరు. వరి, ఆకుకూరలు, కూరగాయ పంటలు పండించడం ద్వారా రైతులకు నిరంతర ఆదాయం వచ్చేలా కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనున్నట్టు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహనరావు, ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి లచ్చన్న తెలిపారు. స్థానికంగా లభ్యమయ్యే వివిధ రకాల ఆకులు, ఆవు పేడ, ఇతర పదార్థాలను ఉపయోగించి కషాయాలు, ఘనజీవామృతం, ద్రవజీవామృతం తయారీ గురించి రైతులకు శిక్షణ ఇస్తున్నట్టు వారు చెప్పారు.

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 118.00 |
| లైవ్ ధర | 138.00 |
| విత్ స్కిన్ | 246.00 |
| స్కిన్ లెస్ | 256.00 |

**కోడి గుడ్లు (నెక్)**

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 440 |
| విజయనగరం | 444 |
| శ్రీకాకుళం | 444 |